

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి : 7 సంచిక : 290 మంగళవారం 22- 09 - 2026 ఎడిటర్ : బరిగెల శివ ■ పేజీలు : 8 ■ వెల : 5.00

పబ్లిషర్స్ : తెలంగాణ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ విజయవాడ, ఢీల్లీ, కర్ణాటక, బెంగళూర్, తమిళనాడు చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్











# వ్యవస్థ నాశనమే వ్యక్తుల స్వార్థం




FIRST INFORMATION REPORT T.S.P.M. Orders 470,500

(Under section 173 and 176 BNSS)

1. District Warangal P.S. Subedari Year 2024 FIR No. 428/2024 Date 14-07-2024
2. Acts & Section(s): 329(3),324(5),115(2),351(2),r/w 3(5) BNS.
3. a) Occurrence of Offence: Day Saturday Date & Time From 13-07-2024 11:00:00
 Date & Time To Prior To Time Period
 b) Information Received at P.S.: Date & Time 14-07-2024 20:00
 General Diary Reference: Entry No 18 Date & Time 14-07-2024 20:00
4. Type of Information: Written
5. Place of Occurrence:
 a) Distance and Direction From P.S.: 2KM, North-East Beat No.
 b) Address Place Area/Mandal Hanamkonda Street/Village Nakkalagutta
 City/District Warangal State Telangana PIN
 c) In case, outside the limit of this Police Station, then
 Name of P.S. District
6. Complainant / Informant:
 a) Name Sujan Kumar Marapelli
 b) Father's /Husband's Name Sudheer Kumar
 c) Date/Year of Birth Age
 d) Nationality India e) Caste
 f) Passport No Date of Issue Place of Issue
 g) Occupation Mobile No. 7989249767
 h) Address House No Area/Mandal Hanamkonda Street/Village Nakkalagutta
 City/District Hanumakonda State TELANGANA PIN
7. Details of known/suspected/unknown accused with full particulars:
 Serial No. 1

- ఈసీ మెంబర్ సురేష్ లాల్ చేయిస్తున్న దాడులు పెరిగిపోతున్నాయి.
- జర్నలిస్టుపై దాడులు చేయండంటూ ఉసిగొల్పేతున్న, ఈసీ మెంబర్ సురేష్ లాల్.
- సైన్స్ ల్యాబ్ లలో జరుగుతున్న ఆకృత్యాలకు కారుకులెవరు.
- క్రైమ్ నెంబర్ 154/2011 ఆధారంగా 3 రోజులు జైలుకు వెళ్లి వచ్చిన ఇస్త్రారి.
- అవినీతి అధికారులపై ఆర్టిఐ కడితే దాడులు చేయిస్తున్నారు.
- అధికారుల అక్రమాలను ప్రశ్నిస్తే దాడులు చేయిస్తున్నారు.
- విశ్వవిద్యాలయంలో జంట పదవుల గోల విపరీతంగా పెరిగిపోయింది.
- మీటింగ్లలో చట్టపట్టాలేసుకొని తిరుగుతున్నది కండ్లకు ఎందుకు కనిపిస్తలేదు.
- జర్నలిస్టు తల్లి కుటుంబ సభ్యులైన మహిళలే అవినీతి అక్రమార్కులకు టార్గెట్.
- అధికారులారా మీ అధికార బలమంతా భూకబ్జాదారులపై ప్రయోగించండి.
- ఈసీ మెంబర్ సురేష్ లాల్ హయంలో జరిగిన పాలకమండలి సమావేశ నిర్ణయాలపై సమగ్ర విచారణ చేపట్టాలి.
- 32 మంది పీహెచ్డీ ఆశవాకుల జీవితాలను నాశనం చేసింది సురేష్ లాల్ కాదా.!
- విద్యార్థుల వేధింపులకు విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులు కాబోతున్నది ఎవరు.


డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-

అధికారాన్ని దుర్వినియోగపరచడం నేరమని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసిన అధికార దుర్విని యోగం కొట్టోచ్చినట్టు కనిపిస్తుందని అన్నారు. ఏ అధికారిక వ్యవస్థ లోనైనా ఏ అధికారైనా ఏ ఉన్నత అధికారైనా అధికార వ్యవస్థల నిర్మాణంలో భాగంగా వ్యవస్థల అభివృద్ధి కొరకు పాటుపడాలి గాని వ్యక్తిగత అభి వృద్ధి కొరకు వ్యక్తిగత స్వార్థం కొరకు వ్యక్తిగత అభిరుచుల కొరకు వ్యక్తిగత ఆనందాల కొరకు వ్యక్తిగతంగా మహిళల మెప్పు కొరకు అధి కార జులుం ప్రదర్శిస్తున్నారే తప్ప వ్యవస్థల నిర్మాణంలో గాని వ్యవస్థల పునర్నిర్మాణంలో గాని భాగస్వాములు కాలేకపోతున్నా రని తీవ్రంగా మందలించారు.ముఖ్యంగా విద్యా వ్యవస్థలో ఎన్నడూ ఊహించని అరాచకాలు జరుగుతున్నాయని వాటన్ని టికీ ప్రధాన కారణం వ్యవస్థల లో అధికార హోదాలను అనుభ వించిన అధికార వ్యక్తులే కారణం అంటూ సూటిగా నిలదీశారు. తెలం గాణ రాష్ట్రంలో పేద బడుగు బల హీన వర్గాలు చదువుకోవాల్సిన విశ్వవిద్యాలయాలు సమూలంగా పతనావస్థ స్థితిలోనికి చేరి పోయాయని దానిని ప్రభుత్వ వర్గం గానీ అధికార వర్గం గానీ అభివృద్ధి పరచలేక చేతులెత్తేసినట్లుగా విశ్వవి ద్యాలయాల పరిస్థితులు తెలియజేస్తున్నాయన్నారు.

**ఉత్తర తెలంగాణ విద్యను ఉడ్చేస్తున్నారు**

తెలంగాణ రాష్ట్రంలో ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కుగా ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయం అధికార దుర్వినియోగం ముసుగు లో ఆగమైపోతుం దని ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం బడుగు బలహీన ఆదివాసి షెడ్యూల్ కులాల పిల్లలకు ఎక్కువ శాతం మేలు జరిగే విధంగా నిర్మాణరూపం దాల్చిన కాకతీయ విశ్వ విద్యాలయం పేద విద్యార్థుల ఉసురుపోసుకునే స్థాయికి చేరువై ందని బాధపడ్డారు.వీసీలు సమర్థవంతులైనప్పుడు అది కారులు పాలకులు అధికార దుర్వినియోగానికి పాల్పడి నిజాయితీ గల వీసీలను పనిచేయకుండా చేయడమే కాకుండా పనికిమాలిన రాజకీయ వ్యవస్థను సృష్టించుకున్న కిందిస్థాయి అధికారులు అంతా ఏకమై వీసీలను భయబ్రాంతులకు గురి చేసిన సం దర్భాలు ఎన్నో చూడగలమ న్నారు. వీసీలు స్వార్థపరులుగా ఉన్న సందర్భంలో అధికారులు అలాంటి వీసీలతో కలిసి పని చేసు కుని విశ్వవిద్యాలయ నిధులను విచ్చలవిడి దుబారాగా ఖర్చులు చేయడమే కాకుండా కాకతీయ విశ్వవిద్యాలయంలో జరిగి నటువంటి అవినీతి అక్రమాలు మరే విశ్వవిద్యాలయంలో జరగలే దనేది పచ్చి నిజంగా చెప్పచ్చు అన్నారు.50 సంవత్సరాల గా విశ్వవి ద్యాలయం అభివృద్ధికి నోచుకోక అల్లాడిపోవడానికి గల ప్రధాన కారణం విశ్వవిద్యాలయాల్లో అధికార పదవుల్లో కొనసాగుతున్న అధికారులు వ్యక్తిగత స్వార్థాలను అభివృద్ధి చేసుకుంటూ అవినీతి సంపాదనకు పాల్పడుతున్నారని తీవ్రంగా హెచ్చరించారు.వాటన్నిటికీ తోడు కేవలం వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మినహా అన్నీ ప్రభుత్వాలు విశ్వవి ద్యాలయ అభివృద్ధి కొరకు కావలసినన్ని నిధులను మంజూరు చేయలే కపోయినారని తెలిపారు.విశ్వవిద్యాలయ అధికారులే భూకబ్జా దారులతో చేతులు కలిపి విశ్వవిద్యాలయ చుట్టుపక్కల భూ ములను కబ్జాలు పెట్టించి వందల కోట్లకు చెందిన భూ ములను వేల కోట్లకు చెందిన భూములను వ్యాపారాలు చేసుకొని కబ్జాల రూపంలో కోర్టు కేసుల రూపంలో కేసు లు వేయిస్తూ భూకబ్జాదారులపై చర్యలు తీసుకునే సందర్భం లో సయోధ్యను కుదుర్చుకొని ఫ్లాట్ల రూపంలో విల్లాల రూపంలో డబ్బుల రూపంలో లబ్ధి పొందుతూ అధికార పదవుల రూపంలో దుర్వినియోగానికి పాల్పడడమే కాకుండా కన్నతల్లి లాంటి విశ్వవి ద్యాలయాన్ని విశ్వవిద్యాల య భూములను కబ్జాలు పెట్టిస్తూ భూకబ్జాలపై పోరా డుతున్నామంటూ దరిద్రపు స్వభావాన్ని ప్రదర్శిస్తు న్నారని దానివల్ల విశ్వవిద్యాలయం మనోభావం విద్యా ర్థుల మనో భావం పూర్తిగా దెబ్బతింటున్నట్లు మండిపడ్డారు.50 సంవ త్సరాల విశ్వవిద్యాలయంలో తప్పుడు బిల్స్, దొంగ బిల్స్, ఆడిట్స్ లేకుండా అవినీతిపరంగా దోచుకున్న సొమ్ముతో వందల కోట్లకు పరిగెత్తిన అధికారులు లేకపో లేదని తెలిపారు.బిల్స్ ఆధా రంగా అవినీతికి పాల్పడితే దొరికిపోతామని భావిస్తున్న కొంత మ ంది అధికారులు అధికార దుర్విని యోగానికి పాల్పడుతూ ఆస్తులు సంపాదించుకు న్నారన్న విషయం పెద్ద ఎత్తున వెలుగు లోనికి వ స్తుందన్నది మేధా వుల అంచనాగా భావిస్తున్నామన్నారు. అదే సం దర్భంలో రె గ్యులర్ ఉద్యోగ నియామకాల్లో కోట్ల రూపాయల వ్యా పారం జరిగిందని ప్రతి రిక్రూట్మెంట్లు స్థాయికి మించిన అక్రమాలు ఉన్నాయని ఏ విశ్వవి ద్యాలయ ంలో లేని కోర్టు కేసులన్నీ కాకతీయ విశ్వవిద్యాలయంలోనే ఉన్నాయన్నది. పచ్చి నిజం అన్నారు.

**వ్యవస్థ అభివృద్ధిలో వ్యక్తిగత ఇమేజ్.వార్తకు సంబంధం లేని వ్యక్తులతో దాడులు చేయిస్తున్నాడు.**

కాకతీయ విశ్వవిద్యాలయంలో వ్యవస్థపరంగా అధికార పదవిని అనుభవించిన అధికారులంతా వ్యక్తిగతమైన అభివృ ద్ధి పెంపొం దించుకునే క్రమంలో అధికార వ్యవస్థను ఉన్నత స్థాయిలో వా డుకుంటున్నారన్నది నిజమని తెలిసినప్పటికీ వ్యవస్థ నాశనం పై జరుగుతున్న అధికార దుర్వినియోగం దాడిని విశ్వవిద్యాలయ మేధావులు విద్యార్థి సంఘాలు కుల సంఘాలు ఉద్యోగ సంఘాలు అధ్యాపక సంఘాలు పసి గట్టకుండా అధికారులపై వార్తల రూపం లో నిరసన రూపంలో ధర్నాల రూపంలో ఆరోపణలు వస్తే మాత్రం అలాంటి అధి కారి వ్యక్తిగత ఇమేజ్ డామేజ్ అవుతుం దంటూ దా డులకు పాల్పడడం బూతులు తిట్టించడం కేసుల పాలు చేస్తా మంటూ బెదిరించడం భౌతిక దాడులు చేస్తామంటూ.. హెచ్చరించడం వాళ్లకు ఉండబడిన పలుకుబడిని పైస సంపాదన

మిగతా 2లో..



## జిల్లాలకు ఐటీ విస్తరణ..!

హైదరాబాద్, సెప్టెంబర్ 21(జై భీమ్ న్యూస్)

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ రంగాన్ని జిల్లాలకూ విస్తరించే దిశగా తెలంగాణ ప్రభు త్వం మరో కీలక అడుగు వేసింది. రూ.60 కోట్లతో అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ నిర్మించగా.. అది ప్రారంభానికి రెడీ అయింది. మూడు ఐటీ సంస్థలు యూనిట్లు ఏర్పాటు చేసేందుకు దరఖాస్తు చేసుకోగా.. స్టార్టప్‌లు కూడా ప్లగ్ అండ్‌ప్లే సదుపాయాలపై ఆసక్తి చూపుతున్నాయి. దాదాపు 2 వేల మంది యువతకు ఉపాధి కల్పించే సామర్థ్యం ఉన్న ఈ టవర్ ద్వారా స్థా నికంగా టెక్నాలజీ ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందే అవ కాశం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఐటీ టవర్లు, హబ్‌లు అందుబాటులోకి రాగా.. యువతకు నై పుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు, స్టార్టప్ అవకా శాలు పెరుగుతున్నాయి. తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరా లు, జిల్లా కేంద్రాలకు విస్తరించే ప్రయత్నాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభానికి సిద్ధమైంది. సుమారు రూ.60 కోట్ల వ్యయంతో నిర్మిం చిన ఈ భవనాన్ని

## కేదారి దంపతుల కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం



హన్మకొండ, సెప్టెంబర్ 21(జై భీమ్ న్యూస్)

తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలం దించిన దివంగత లింగాల కేదారి, ఆయన భార్య దివంగత పుష్పలత కుటుంబాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ము ఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హనుమకొండలోని శాంతినగర్, పోస్టల్ కాలనీకి చెందిన లిం గాల కేదారి, ఆయన భార్య పుష్పలత తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో సమాజం పట్ల ఎంతో బాధ్యతతో వ్యవ హరించారు. సాధారణ హోటల్ నిర్వహిస్తూ ఆహారాన్ని వృథా చేయకూడదని, అన్నం పరబ్రహ్మ స్వరూపమనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ కారులకు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందిస్తూ తమ వంతు సహకారం అందించారు. కేదారి దంపతులు ఉద్యమ సమయంలో అందించిన సేవలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. లింగాల కేదారి 2026 సెప్టెంబర్ 9న, ఆయన భార్య పుష్పలత 2026 సెప్టెంబర్ 10న విషాదకర సంఘటనలో మృతి చెందారు. దీంతో వారి కుటు ంబం తీవ్ర విషాదంలోకి వెళ్లింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కుటుంబాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందేలా అవసరమైన చర్యలు తీసుకో వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్‌ను అధికారులు ఆదేశిం చారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేదారి దంపతులు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## జగన్ ప్రజల్లో కావాలని విషప్రచారం..

విజయవాడ, సెప్టెంబర్ 21(జై భీమ్ న్యూస్)



విజయవాడలో వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమం ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలా ఎంతమాత్రం లేదని, అది నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అరాచక చర్య అని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్ధా వెంకన్న మండిపడ్డారు. పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ అధినేత జగన్ ప్రజల్లో కావాలని విషప్రచారం చేస్తున్నారని, అయితే ఆయన అబద్ధాలను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని స్పష్టంచేశారు. ఎలాంటి పక్షపాతానికి తావు లేకు ండా అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించడమే త మ కూటమి ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు.ప్రత్యేకించి స్పోర్ట్స్ కోటా కింద అర్హత సాధించిన క్రీడాకారులకు పారదర్శకంగా డీఎస్సీ ఉద్యోగాలు దక్కడంతో నిరుద్యోగ యువత ఎంతో ఆనందంతో ఉందని బుద్ధా వెంకన్న తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువత భద్రతకు, ఉపాధి కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తుంటే, అర్హులైన క్రీడాకారులకు న్యాయం జరగడాన్ని కూడా వైసీపీ నేతలు జీర్ణించుకో లేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# జిల్లాలకు ఐటీ విస్తరణ..!

మొదటిపేజీ తరువాయి

ఈ నెలాఖరులో ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించనున్నారు. జాతీయ రహదారి–44కు ఆనుకుని ఉన్న ఈ టవర్ ఐటీ కంపెనీలు, స్టార్టప్‌లకు ప్లగ్ అండ్ ప్లే మౌలిక సదుపాయా లను అందించనుంది. 4 అంతస్తులతో నిర్మించిన ఈ భవనంలో సుమారు 50 వేల చదరపు అ డుగుల ఆఫీస్ స్పేస్, మీటింగ్ హాళ్లు, రిసెప్షన్, లాంజ్‌లు, కేఫెటీరియా వంటి సదుపాయాలు ఉ న్నాయి. మూడు ఐటీ సర్వీసెస్ కంపెనీలు తమ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే దర ఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆదిలా బాద్ పట్టణంలోని ప్రైవేటు భవనంలో పనిచేస్తున్న ఓ ఐటీ సంస్థ కూడా ఇక్కడికి మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. స్టార్టప్‌లు సైతం అందుబా టులో ఉన్న ప్లగ్ అండ్ ప్లే మౌలిక సదుపాయా లపై ఆసక్తి చూపుతున్నాయి. ఈ టవర్ పూర్తిస్థా యిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే దాదాపు 2 వేల మంది యువతకు ఉపాధి లభించే అవకాశం ఉం దని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే పెద్ద ఐటీ కంపెనీలు ఆదిలాబాద్ వంటి నగరాల్లో శాశ్వతంగా శాఖలు ఏర్పాటు చేసే స్థాయిలో డి మాండ్ పెరుగుతుందా ? అనే ప్రశ్న కూడా ఉం ది. అందుకు కంపెనీలను ఆకర్షించడం, స్థానిక యువత నైపుణ్యాలను పరిశ్రమ అవసరాలకు అనుగు ణంగా తీర్చిదిద్దడం కీలకమని టెక్ నిపు ణులు చెబుతున్నారు. కాగా, తెలంగాణలో పలు జిల్లా కేంద్రాల్లో ఇప్పటికే ఐటీ టవర్లు, ఐటీ హబ్‌లు ఉన్నాయి. ఖమ్మం, నిజామాబాద్, కరీం నగర్, వరంగల్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, నల్గొండ వంటి కేంద్రాల్లో ఐటీ సంబంధిత మౌలిక సదుపాయాలు అందిస్తు న్నాయి. నిజామాబాద్ ఐటీ టవర్‌లో 881 సీట్ల సామర్థ్యం ఉండగా.. 338 సీట్లు ఇప్పటికే ఆక్యుపై అయ్యాయి. మరో 400 మందికి పైగా ఉద్యోగులకు స్థలం కల్పించే అవ కాశం ఉందని మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల అసె ంబ్లీలో వెల్లడ ించారు. నల్గొండ ఐటీ టవర్ రూ. 100 కోట్లతో నిర్మించ బడినప్పటికీ.. అక్కడ కొన్ని సంస్థలు మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. సిద్దిపేటలో మాత్రం ప్రారంభ దశలోనే స్థానిక యువతకు ఉ ద్యోగాలు కల్పించే ప్రయత్నాలు జరిగాయి. ఐటీ టవర్ ప్రా రంభానికి ముందు నిర్వహించిన జాబ్ మేళాలో 15 సంస్థలు 750 మంది సాఫ్ట్‌వేర్ ప్రొ ఫెష నల్స్‌ను ఎంపిక చేశాయి. ఐటీ టవర్ ద్వారా సుమారు 1000 మందికి ఉపాధి కల్పించే లక్ష్యా న్ని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. తెలం గాణ ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2014–15లో రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ.66,276 కోట్లుగా ఉండ గా.. 2022–23 నాటికి రూ.2,41,275 కోట్లకు చేరాయి. ఇదే కాలంలో ఐటీ రంగంలో పని చేస్తున్న నిపుణుల సంఖ్య 3.71 లక్షల నుంచి 9.05 లక్షలకు పెరిగింది.

# కలెక్టర్‌ను కలవనివ్వలేదు..

# ఎమ్మెల్యే అయ్యాడు!

**– జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం**

కామారెడ్డి(జై భీమ్ న్యూస్)

జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగా రాం రాజకీయ ప్రస్థానం ఎన్నో ఆసక్తికర మలుపులతో సాగింది. చిన్ననాటి నుంచే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్న ఆయన.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజకీ యాల్లోకి అడుగుపెట్టి, స్థానిక సంస్థల పద వుల నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎది గారు. అధికారులను కలిసి ప్రజల సమస్య లను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తూ, గ్రామీ ణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు.

గంగారాం రాజకీయ ప్రస్థానం 1976లో ప్రారంభమైనట్లు అప్పటి కథనాలు పేర్కొంటు న్నాయి. ప్రజా జీవితంలోకి వచ్చిన తర్వాత పలు స్థానిక సంస్థల పదవులు చేపట్టి తన రాజకీయ పునాదిని బలోపేతం చేసుకున్నా రు. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసు కుంటూ, వాటి పరిష్కారం కోసం అధికారు లను సంప్రదిస్తూ ముందుకు సాగారు.

ఆయన రాజకీయ జీవితంలో కీలక మలు పుగా జుక్కల్ అసెంబ్లీ నియోజక వర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం నిలిచింది. అం దుబాటులో ఉన్న వివరాల ప్రకారం 1983, 1989, 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజ యం సాధించినట్లు అప్పటి కథనాల్లో పేర్కొ న్నారు. ముఖ్యంగా 2004లో కాంగ్రెస్ పార్టీ తరఫున జుక్కల్ నుంచి విజయం సాధించి మరోసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు.

జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం కావడంతో గంగారాం రాజ కీయ ప్రయాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్ప డింది. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతా లు, ప్రజా సమస్యలు, సామాజిక అంశాలపై ఆయన తన రాజకీయ జీవితంలో దృష్టి సారి ంచినట్లు అప్పటి వార్తా కథనాలు పేర్కొన్నాయి.

ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులను కలవడం, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడం తన రాజకీయ శైలిలో భాగంగా కొనసాగించారు. ఒకప్పుడు కలెక్టర్‌ను కలవడానికి కూడా అవకాశం లేని స్థాయి నుంచి రాజకీయంగా ఎదిగి ఎమ్మెల్యే కావడం ఆయన రాజకీయ ప్రస్థానంలోని ఆసక్తికరమైన అంశంగా అప్పటి కథనాల్లో ప్రస్తావించబడింది.

తర్వాతి ఎన్నికల్లోనూ గంగారాం రాజకీయ పోరాటాన్ని కొనసాగించారు. 2014లో కాంగ్రెస్ తరఫున జుక్కల్ నుంచి పోటీ చేశారు. అనంతరం కూడా నియోజకవర్గ రాజకీయాల్లో



క్రియాశీలకంగా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**2023లో మళ్లీ తెరపైకి వచ్చిన టికెట్ అంశం**

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జుక్కల్ కాంగ్రెస్ టికెట్ కోసం సౌదాగర్ గంగారాం పేరు మరోసారి ప్రముఖంగా వినిపించింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, నియోజకవర్గంలో తనకు ఉన్న పరిచయాలు, గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ ఆయన టికెట్ ఆశించారు. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం జుక్కల్ అభ్యర్థి గా లక్ష్మీకాంతరావును ఎంపిక చేయడంతో గంగారాం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు అప్ప టి వార్తా కథనాలు పేర్కొన్నాయి. కార్య కర్తలతో సమావేశాలు నిర్వహించి తన తదు పరి రాజకీయ నిర్ణయంపై చర్చించారు.

దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగిన సౌదాగర్ గంగారాం ప్రయాణం.. ఒక సాధారణ ప్రజా కార్యకర్తగా ప్రారంభమై, స్థానిక సంస్థల పదవులు, ఎమ్మెల్యే పదవి, తిరిగి పార్టీ టికెట్ కోసం పోరాటం వరకు సాగింది. అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రజా సమస్యల కోసం తిరిగిన వ్యక్తి నుంచి శాసనసభలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగిన ఆయన రాజకీయ ప్రస్థానం జుక్కల్ రాజకీయ చరిత్రలో ఆసక్తికరమైన అధ్యాయంగా నిలిచింది.

# వ్యవస్థ నాశనమే వ్యక్తుల స్వార్థం

మొదటిపేజీ తరువాయి

ఉపయోగించి కొంతమంది కిరాయి వ్యక్తులతో మానసి కంగా వేధిస్తూ దాడులు చేయించడం 50 సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉందన్నారు. అధికార హోదాను అడ్డం పెట్టు కొని అవినీతిలకు, అక్రమా లకు, అధికార దుర్వినియోగాలకు పాల్పడితే వ్యక్తిగత ఇమేజ్ డామేజ్ అవ్వదా అంటూ సూటిగా ప్రశ్నించారు. అధికార హోదాను అడ్డం పెట్టుకొని విద్యా ర్థులకు విశ్వవిద్యాలయ వ్యవస్థకు పూర్తి వ్యతిరేకమైన నిర్ణయా లతో విద్యార్థుల జీవితాలను నాశనం చేయడమే కాకుండా వ్యవస్థను భ్రష్టు పట్టించడం జరుగుతున్న ప్రతి సందర్భంలో వ్యక్తిగత డ్యామేజ్ ఎందుకు గుర్తుకు రావడం లేదంటూ సూటిగా నిలదీశారు. వ్యవస్థను నాశనం చేయడంలో ఉన్నంత శ్రద్ధ వ్యక్తిగత ఇమేజ్ను పెంపొందించుకోవాలనే ఆత్రుత ఎం దుకు లేకపోతుందని సూటిగా నిలదీశారు. నిజాయితీగా పని చేస్తే అధికారులకు అపనిందలు ఎందుకు వస్తాయి అంటూ గుర్తు చేశారు. అధికార హోదాలో కొనసాగిన వ్యక్తి అధికార హోదాలో కొనసాగుతున్న వ్యక్తి ఎంతటి వారైనా వ్యక్తిగత ఇమేజ్ ఉండదన్నది గుర్తించి తీరాలన్నారు. అధికార హోదాలో జవాబుదారీ తన మాత్రమే ఉంటుందని ఒక్కానించెప్పారు. పాలకుల స్వార్థాల కోసం అధికార హోదాలు అనుభవిస్తున్న వ్యక్తుల స్వార్థాల కోసం కాకతీయ విశ్వవిద్యాలయ చట్టాలకు విరుద్ధంగా పాలకమండలి సమావేశాల్లో నిర్ణయాలు తీసుకుంటూ దాన్నే రహస్యపు అభివృద్ధిగా బలపరచుకుంటు న్నారు. తప్ప విద్యార్థుల భవిష్యత్తు పట్ల గాని విద్యావ్యవస్థ పునర్నిర్మానం పట్ల గాని ఏ ఒక్క అధికారికి పట్టింపు లేకుండా పోతుందన్నది వాస్తవం అన్నారు. శ్రద్ధగా పనిచేస్తున్న అధికా రులేమో నిందలపాలవుతుంటే దుబారా పాలకులేమో విద్యాల యంలో చలాయిస్తున్న వ్యక్తులుగా, చాలా మంచి వాళ్ళుగా చలామణి అవుతుండడం సిగ్గుచేటు అన్నారు.

**- జర్నలిస్టుపై ఈసీ మెంబర్ సురేష్ లాల్ దాడులు.**

**- జర్నలిస్టు కుటుంబ మహిళలపై దాడులకు ఉసిగొల్పుతున్నాడు.**

**- బాధ్యత మరిచిన వీసి రిజిస్ట్రార్.**

జర్నలిస్టులు వార్తలు రాస్తే దాడులు చేయించాలనే గొప్ప మనస్తత్వం కలిగిన కేయూ ఈసీ మెంబర్ సురేష్ లాల్ జై భీమ్ సంస్థలో పనిచేస్తున్న నా బ్యూరో ప్రతినిధి వార్త రాస్తే మానసిక శారీరక భౌతిక దాడులు చేయించడానికి కొంత మంది తన వర్గానికి చెందిన వ్యక్తులను సిద్ధపరచుకొని కే యూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంకు వినతి పత్రం ఇప్పిం చి తన అధికార బలాన్ని ప్రయోగిస్తున్న తీరు సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకోవాలని గుర్తు చేయడమైనది. గతంలో ప్రిన్సిపాల్ గా కొనసాగిన సురేష్ లాల్ నిరుపేద విద్యార్థులు చదువుకునే విద్యార్థుల కోర్సుల ఫీజు లకు కేయూ కాలేజ్ అఫ్ ప్రిన్సిపల్ స్థానంలో ఫీజుల కమిటీ చైర్మన్ హోదాలో ఉండి ప్రైవేట్ విశ్వవిద్యాలయాల కన్నా అధికమైన ఫీజులు పెంచి 5000 మంది విద్యార్థులు రోడ్డు నపడి ధర్నా చేసే పరిస్థితిని తీసుకువచ్చిన సంగతిని ఎవరు మర్చిపోలేనిది అన్నారు. స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీగా కొనసాగిన క్రమంలో ముక్కుపచలారని ఎస్టీ విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన సందర్భంగా అమ్మాయికి సంబంధించిన తోటి విద్యార్థి ప్రశ్నించడానికి వెళ్తే విపరీతమైన దాడి చేయించిన సంగతిని దెబ్బలు తిన్న విద్యార్థికి సంబంధించిన వీడియో విపరీతమైన చక్కర్లు కొట్టగా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయబడిన సంగతిని ఎవరు మర్చిపోలేనిది ఉన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గా పనిచేసిన సందర్భంలో సుమారు రెండు కోట్ల అవినీతి జరిగిందని అప్పటి ఇంగ్లీష్ ప్రొఫెసర్ దామోదర్ చైర్మన్గా కమిటీ వేయబడగా కమిటీ నివేదిక ఆధారంగా నిధుల దుర్వినియోగం నిధులు అవినీతిపై సిఐడి విచారణ జరిపించా లని రిపోర్ట్ సమర్పించగా చర్యలు జరగకుండా ప్రభుత్వ స్థాయి పైరవీలు చేసుకొని ఆపించుకున్నాడని అవినీతి దుర్వి నియోగంపై స్టేట్ ఆడిట్ రిమార్క్స్ రాయగా అప్పటి ఎన్ఎస్ఎస్ బ్యాంక్ స్టేట్మెంట్ ఆధారంగా నిధుల ఆధారాలను వెలికి తీసి విచారణ జరిగే క్రమంలో రాజకీయ పైరవితో అతి నివేదిక నివేదిక ప్రకారం చర్యలు తటస్థంగా ఉండిపోయా యని గుర్తు చేశారు. కెమిస్ట్రీ ప్రొఫెసర్ హనుమంతుకు రావ లసిన డీన్ విషయంలో అన్యాయం జరగగా అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ ఏ ఒక్కరు స్పంది ంచకపోతే ఇదే జర్నలిస్టు ఒంటరిగా పోరాటం చేసి తనకు న్యాయం జరిగే వరకూ నిలబడిన సంగతిని జ్ఞాపకం చేస్తు న్నామన్నారు. ఈసీ మెంబర్ సురేష్ లాల్ గతంలో కరీంనగర్ పీజీ సెంటర్ డైరెక్టర్ పనిచేసినప్పుడు పీజీ సెంటర్ సం బంధించిన భూముల వ్యవహారంలో ప్రైవేట్ వ్యక్తులు వెంచర్ చేసుకోగా పీజీ సెంటర్ పరిధిలోని భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టగా వాళ్లకు పూర్తిగా సహకరించాడనే అభి యోగం ఇప్పటికి విశ్వవిద్యాలయాన్ని వెంటాడుతూనే ఉంద న్నారు అదే సందర్భంలో కరీంనగర్ పీజీ సెంటర్ నిర్మాణం కొరకు తీసుకోబడిన విస్తీర్ణాన్ని ప్రభుత్వాలు రెవెన్యూ మున్సి పల్, భూ కొలతలు,విజిలెన్స్ అధికారులచే గ్లోబల్ సర్వే నిర్వహించి పీజీ సెంటర్లో చొచ్చుకొని కబ్జా చేయబడిన ఇండ్ల స్థలం ఏ సంవత్సరం కట్టబడినదో ఎవరు సహకరించారో వాటి ఆధారాలను వెలుగు తీసి విశ్వవిద్యాల అధికారులు చర్య లు తీసుకోవాల్సిన అవసరం ఉందని బాహాటంగా తెలుపు తున్నామన్నారు. క్రైమ్ నెంబర్ 428/2024 తేదీ 14/07/ 2024 ఈసీ మెంబర్ సురేష్ లాల్ పై హన్మకొండ మాజీ జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్ కుమార్ తన కుమారుడు సృజన్ కుమార్ మున్సిపల్ అనుమతులతో కట్టుకుంటున్న నిర్మాణాన్ని కూల్చివేయగా సురేష్ లాల్ మరో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయబడినట్లు పై క్రైమ్ నెంబర్ ఆధారాలు తెలియజేస్తున్నాయన్నారు. బాధితుడు సృజన్ తెలి పిన వివరాల ప్రకారం సుమారు 20 లక్షల వరకు వాళ్లకు చెందిన నిర్మాణ సామాగ్రిని పూర్తిగా ధ్వంసం చేసినట్లు ఎఫ్ఐ ఆర్లో పేర్కొన్నట్లు ఆధారాలు తెలియజేస్తున్నాయన్నారు. గతంలో ఇస్తారి అనే వ్యక్తి తన పరిశోధకు రాలిపై బలవంతపు అగా యిత్యానికి పాల్పడినాడని విద్యార్థి సంఘాలు అందరూ జంతుశాస్త్ర విభాగానికి చేరి తీవ్రంగా మందలించే క్రమంలో క్రైమ్ నెంబర్ 154/2011 ఆధారంగా కేసు నమోదు చేయబడి మూడు రోజులు జైలుకు వెళ్లి వచ్చిన్నప్పటికిని అధికారులకు తెలవకుండా గుట్టుచప్పుడు కాకుండా ఉద్యోగంలో కొనసాగుతూ ఇప్పటికీ అక్రమంగా రెండు పదోన్నతులు పొందుకున్నాడని తన పరిశోధనలన్నీ అక్రమ పద్ధతిలో తప్పుడు పత్రాలు సృష్టించుకుని అనుమతులు లేకుండా చేయబడినవని సాక్షాత్తు విశ్వవిద్యాలయంలోని అధికారిక బోర్డ్స్ నిర్ధారించినప్పటికిని వాటిని పరిగణలోకి తీసుకోకుండా అధికార పదవుల్లో కొనసాగించడమే కాకుండా విశ్వవిద్యాలయంలో అన్ని వర్గాలపై అక్కాసు వెళ్లగకుతూ విశ్వవిద్యాలయ చట్టాలకు విరుద్ధంగా ఉద్యోగ చట్టాలకు విరుద్ధంగా సమస్యలు సృష్టిస్తూ గొడవలు పెట్టిస్తూ అల్లరి చేయిస్తూ అధికారులపై వార్తలు రాయిస్తూ నిందలు వేయిస్తూ అడ్డగోలు పనులన్నీ



చేస్తున్నప్పటికిని కుల సంఘాలు ఏమాత్రం పట్టించుకోకపోవడం విశ్వవిద్యాలయ ఉనికిని పూర్తిగా దెబ్బతీసినట్టే అన్నారు. విశ్వవిద్యాలయంలో భూకబ్జా లకు పాల్పడిన ఒక కరుడుగట్టిన భూకబ్జాదారున్ని వెనుకే సుకొస్తూ జర్నలిస్టు తల్లిని తిట్టించడమే కాకుండా అతనికి పూర్తిస్థాయిలో సహకరిస్తూ తన ఉద్యోగానికి భద్రత కల్పించిన ఈసీ మెంబర్ సురేష్ లాల్ ఎంతటి గొప్ప పని చేశారో విజిలెన్స్ విచారణ జరుగుతున్న సందర్భంలో ఆధారాలను సమర్పించే అవకాశం ఉందని గుర్తుచేశారు. ప్రతి ఒక్కడు వార్త లు రాస్తున్న జర్నలిస్టులపై నిందలు వేయడం మానసిక దా డులు చేయడం అలవాటుగా పెట్టుకున్నారని జర్నలిస్టులపై దాడికి పురికొల్పుతున్న సురేష్ లాల్ తన అధికారిక హోదాలో కొనసాగిన అక్రమాలు, అధికార దుర్వినియోగాలు, అవినీతి బయటపడిన రోజు తన నిజాయితీపై ఎంత నమ్మకం ఉందో విశ్వవిద్యాలయంలో ప్రతి ఒక్కరు గమనిం చగలరు అన్నారు. జీతం తీసుకోకుండా సమాజం కొరకు మానసిక శారీరక ఆర్థిక దాడులను తట్టుకొని పనిచేస్తున్న జర్నలిస్టుల మీద అడ్డగోలు నిందలు వేస్తూ అర్థనగ్న ప్రదర్శనలు మహిళలను వేధిస్తున్నారంటూ డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు అంటూ వినతిపత్రం ఇప్పించిన సురేష్ లాల్, ఇస్తారి, ప్రస్తుతం ఏం గాభరాపడాల్సిన పనిలేదని విజిలెన్స్ విచారణ జరుగుతున్న సందర్భంలో ప్రతి ఆదారం బయటకు వస్తుందని హెచ్చరించారు.

**ప్రధానంగా చేపట్టాల్సిన విచారణ చర్యలు.**

కాకతీయ విశ్వవిద్యాలయంలో అధికారకు హోదాలో కొన సాగుతున్న కొంతమంది వ్యక్తులు మహిళలను వెంటబెట్టుకొని చెట్టాపట్టాలేసుకుంటూ తిరుగుతున్నారని విద్యార్థులు తీవ్రం గా విమర్శించడాన్ని వీసీ రిజిస్ట్రార్ క్షేత్రస్థాయిలో పసిగట్టాలని గుర్తు చేశారు. కేయూ సైన్స్ ల్యాబ్ లలో మహిళలపై పరిశోధకురాళ్లపై జరుగుతున్న అకృత్యాలపై మానసిక దాడులపై సెక్సువల్ దాడులపై విశ్వవిద్యాలయ అధికారులు క్షేత్రస్థాయి విచారణలో పసిగట్టాల్సిన అవసరం ఉందన్నా రు. సీక్రెట్ ల్యాబులు ఏర్పాటు చేసుకొని పరదలు పెట్టుకొని సీసీ కెమెరాలు లేకుండా సైన్స్ ల్యాబ్ లలో మహిళలను వేధి స్తున్న విధానాలపై కఠినమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మరో ముఖ్యమైన విషయం అధికారులు పసిగట్టా ల్సిందిగా తెలియజేస్తూ విశ్వవిద్యాలయం లో ఎక్కడ చూసినా జంట పదవుల గోల ఎక్కువైపోయిందని దానిని పసిగట్టే క్రమ ంలో కేయూ అధికారులు ఎవరెవరికి జంట పదవులు కట్టబెడుతున్నారో జాగ్రత్తగా పసిగట్టి విశ్వవిద్యాలయ పరువు ను కాపాడాలని కోరారు. మహిళలను వేధించే వ్యక్తులు ఎవరో అసభ్యకరమైన కార్యక్రమాలతో మహి ళలకు సంబంధాలు కలుపుతున్న వ్యక్తులు ఎవరో మహిళలను వేధించి జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తిపై అన్ని ఆధారాలు బయటకు వస్తాయని ప్రస్తుతం మహిళల వెంటబెట్టుకొని తిరుగుతూ జర్నలిస్టులపై మహిళా వేధింపుల నిందలు వేయిస్తున్న అధికారి ఎవరో బయటకు రాక తప్పదు అన్నారు. ఈసీ మెంబర్ సురేష్ లాల్ సీనియర్ ఆచార్య హోదాలో ఈసీ మెంబర్గా ఎలా నియమకం చేయబడ్డాడో తన సర్వీస్ ఆధారంగా వివరాలు బయటపెట్టాలని వీసి రిజి స్టార్ను డిమాండ్ చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యాబుద్ధులకు బదులు బయట ప్రాంతాలలో ఓయో రూముల సంస్కృతిని పెంచి పోషిస్తున్న అధికారులు ఎవరో, అలాంటి వాటిని పెంచి పోషిస్తున్న విద్యార్థులు ఎవరో వాళ్లకు సహకరిస్తున్న వ్యక్తులు ఎవరో అన్ని బయటకు వచ్చే ఆస్కారం ఉందన్నారు. ప్రస్తుతం ఈసీ మెంబర్గా కొనసాగుతున్న సురేష్ లాల్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ప్రతి ఈసీ మీటింగ్ అజెండా మినిట్ వాటి నిర్ణయాలపై సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డిపై ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయం ఆకాస్త రక్షణ వలయంలో ఉందంటే దానికి ప్రధాన కారణం కేవలం ఎస్బి, విజిలెన్స్ ,కేయూ పోలీసులేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పోలీసు అధికారులు విశ్వవిద్యాలయంపై ఎప్పటికప్పుడు నిఘా వేస్తూ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నందునే ఆ మాత్రం రక్షించబడుతుందని లేదంటే గాలికి వదిలేసిన గాలిపటంలా విశ్వవిద్యాలయం ఉనికి ఎప్పుడో ఊడిపోయేది అన్నారు.

## కాకినాడ మెడికవర్‌లో అత్యాధునిక

# క్యాన్సర్ వైద్య సేవలు ప్రారంభం






**కాకినాడ, సెప్టెంబర్ 21(జై భీమ్ న్యూస్)**

కాకినాడ నగరంలో క్యాన్సర్ రోగులకు అత్యాధునిక, సమగ్ర వైద్య సేవలను అందించేందుకు మెడికవర్ హాస్పిటల్స్‌లో నూతన క్యాన్సర్ వింగ్‌ను ప్రారంభించారు. సోమవారం ఏ.డీ.బీ. రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన క్యాన్సర్ విభాగాన్ని పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వీఎస్ఎన్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ, కాకినాడలో ఆధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో మెడికవర్ హాస్పిటల్స్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమానికి లయన్ చిట్నీడి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ గవర్నర్, జనసేన పార్టీ నాయకులు దుగ్గన బాబ్జీ తదితరులు హాజరయ్యారు. నూతన క్యాన్సర్ వింగ్‌ను సందర్శించి ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ ఎన్. అంజిబాబు మాట్లాడుతూ, క్యాన్సర్ రోగులకు అవసరమైన సమగ్ర వైద్య సేవలను ఒకే వేదికపై అందించాలనే ఉద్దేశంతో నూతన క్యాన్సర్ వింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాన్సర్ నిర్ధారణ నుంచి చికిత్స వరకు వివిధ దశల్లో నిపుణులైన వైద్యుల సమన్వయంతో సేవలు అందించేందుకు ఈ విభాగం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. క్యాన్సర్ చికిత్సలో మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సమన్వయం కీలకమని వైద్యులు తెలిపారు. రోగి క్యాన్సర్ రకం, దశ, అవసరాలను పరిగణనలోకి తీసుకుని వ్యక్తిగతీకరించిన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ డా. మురళీధర్ మాట్లాడుతూ, క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి సకాలంలో తగిన చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. కాకినాడలో సమగ్ర క్యాన్సర్ సేవలు అందుబాటులోకి రావడం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. రేడియేషన్ ఆంకాలజిస్టులు డా. పృధ్వీ రాజ్, డా. ప్రదీప్ భాస్కర్ మాట్లాడుతూ, ఆధునిక రేడియేషన్ థెరపీ ద్వారా క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకుని చికిత్స అందించవచ్చని తెలిపారు. రోగి క్యాన్సర్ రకం, దశకు అనుగుణంగా రేడియేషన్ చికిత్సను ప్రణాళిక చేయడం ముఖ్యమని, ఆధునిక సాంకేతికతతో రోగి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. సర్జికల్ ఆంకాలజిస్టులు డా. సమంత్ కుమార్, డా. శివ భరత్ మాట్లాడుతూ, అవసరమైన సందర్భాల్లో క్యాన్సర్ చికిత్సలో శస్త్రచికిత్స కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వివిధ ఆంకాలజీ విభాగాల సమన్వయంతో సమగ్ర చికిత్స అందించడం ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. క్యాన్సర్‌కు సంబంధించిన అనుమానాస్పద లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ద్వారా చికిత్స ఫలితాలను మెరుగుపరచే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. ప్రజలు అనుమానాస్పద లక్షణాలు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఇతర అతిథులు పాల్గొన్నారు. నూతన క్యాన్సర్ వింగ్ అందుబాటులోకి రావడంతో కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సకు సంబంధించిన సమగ్ర వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి.



## పీఏసీఎస్ అధ్యక్షుడిగా

# గంగుల శ్రీనివాస్‌రెడ్డి

**- డైరెక్టర్‌గా పోలేపల్లి దివాకర్‌రెడ్డికి సన్మానం**

**ఖాజీపేట,సెప్టెంబర్21, జై భీమ్ న్యూస్**

దర్గా కాజీపేట పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడిగా గంగుల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌గా పోలేపల్లి దివాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారిని ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్, ఐనవోలు సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోలేపల్లి శివశంకర్‌రెడ్డి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వారికి ఈ సదావకాశాన్ని కల్పించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, డైరెక్టర్‌కు అభినందనలు తెలియజేస్తూ, రైతుల సంక్షేమం కోసం పీఏసీఎస్ ద్వారా మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలేపల్లి సురేందర్‌రెడ్డి, చెన్నారెడ్డి, శ్రీనివాస్‌రావు, కిషన్‌రావు, తిరుపతిరెడ్డి, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.






# ప్రజావాణికి 243 దరఖాస్తులు

**వరంగల్, సెప్టెంబర్ 21, (జై భీమ్ న్యూస్)**

జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్. కిషోర్ కుమార్, డీఆర్వో విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ విష్ణువర్ధన్ రెడ్డి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 243 దరఖాస్తులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 60, జీడబ్ల్యూఎంసీకి 84, హౌసింగ్ శాఖకు 35, ఇతర శాఖలకు సంబంధించిన 64 దరఖాస్తులు వచ్చాయి. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలను సమర్పించారు. ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ, డీఆర్డీఓ పరిధిలోని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసి, సమస్యలను త్వరిత గతిన పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గణేష్ సూచించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు.

## చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో

# మహా అన్నదానం

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఆడెపు సుగుణ - కేదారి,కడ్దూరి రజిత- మల్లారెడ్డి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ ఆడేపు విక్రమ్ మాట్లాడుతూ చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులు భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో ఈ గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహించాలని కొనియాడారు. విద్యా బుద్ధులు అవిఘ్నేశ్వరుడు ప్రసాదించి వారు ఉన్నత స్థాయిలో ఎదిగి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆడెపు స్రవంతి దయాకర్, వార్డు సభ్యులు మజ్జిగ రాజు, పొన్నాల రమ రాజు, గూడ సునీలు, చెంచు మౌనిక రాజు, మాజీ ఎంపిటిసి ఖర్దూరి రాజు,చత్రపతి శివాజీ యూత్ ఆర్గనైజర్స్ శివ గణేష్, మనోజ్, గోపిచంద్, రిషికర్, శివాత్మిక్ నాయకులు కొట్టం మోహన్, అనుముల ఆగారెడ్డి, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గురజాడ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం




**- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 21(జై భీమ్ న్యూస్)**

మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. గురజాడ అప్పారావు 164వ జయంతి సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం, సంస్కరణలకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. కన్యాశుల్కం వంటి రచనల ద్వారా సమాజంలోని అనేక దురాచారాలను ప్రశ్నించి, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని పేర్కొన్నారు. "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అనే సందేశం ద్వారా మానవతా విలువలు, సమాజ సంక్షేమం, సామాజిక బాధ్యతకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యాన్ని వివరించారు. యువత గురజాడ అప్పారావు జీవితం, రచనలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యతో పాటు సేవాభావం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గురజాడ రచనలు సమాజంలో మార్పు, చైతన్యానికి ఎంతగానో దోహదపడ్డాయని అన్నారు. సమాజంలోని సమస్యలను తన రచనల ద్వారా ఎత్తిచూపిన గురజాడ ఆశయాలను నేటి తరాలు ఆచరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ సమాజంలోని లోపాలను ప్రశ్నిస్తూ, మార్పు కోసం తన కలాన్ని ఆయుధంగా మలిచిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని అన్నారు. "సొంత లాభం కొంత మానుకు.. పొరుగు వానికి తోడుపడవోయ్" అనే సందేశం నేటికీ ఎంతో ప్రాసంగికమని తెలిపారు. సమాజ హితం, మానవతా విలువలు, పరస్పర సహకారానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గురజాడ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి, ఆర్డీవోలు ఆర్. శివరాముడు, కె. ఆనందరావు, డీఎస్పీ ఏ. శివప్రియ, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**- ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానా**

**వరంగల్, సెప్టెంబర్ 21 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రి భవనాల భద్రత, పరిశుభ్రత, సిబ్బంది హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానా జె. చొంగ్తు, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిని వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ వాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యతో కలిసి ఆమె సందర్శించారు. తొలుత ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డును పరిశీలించిన ముఖ్య కార్యదర్శి, ఆదివా రం వార్డులో పెచ్చులు ఊడిపడిన ఘటనకు దారితీసిన పరి స్థితులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న చికిత్స, మౌలిక వసతులపై అధికారులతో సమీ క్షించారు. అనంతరం ఆసుపత్రి భవనాల స్థితిగతులపై ఆర్ అండ్‌బీ ఈఈ నరేందర్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ ఈఈ ప్రసాద్ లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి భవనాల భద్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించిన ఆమె రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది అందు బాటు, విధుల హాజరు తదితర అంశాలపై ఆరా తీశారు. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌తో పాటు సిబ్బంది హాజరు వివరా లను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సమ యపాలనతో హాజరై రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆసుపత్రి పరిస రాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను సమీక్షించారు. రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు రూపొందిం చాలని అధికారులకు సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బ ందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలు, సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సంద ర్భంగా ఆసుపత్రిలో భద్రత, నిర్వహణ, వైద్య సేవల నాణ్యత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు సమన్వ యంతో పనిచేయాలని ముఖ్య కార్యదర్శి సూచించారు. ఈ పర్యటనలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కుమార్‌రెడ్డి, వైద్యులు, అధికారులు, పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడపొద్దు..

# ప్రాణాలను కాపాడుకోండి

**- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 150 మందికి ట్రాఫిక్ ఏసీపీ కౌన్సెలింగ్**

**- ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ**

**వరంగల్, సెప్టెంబర్ 21 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలకు గురై విలువైన ప్రాణాలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ సూచించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని హన్మకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ)లో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన సుమారు 150 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ మద్యం సేవించిన అనంతరం వాహనం నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర వాహనదారులు, ప్రయాణికులు, పాదచారుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. మద్యం ప్రభావంలో వాహనంపై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, ప్రాణనష్టం, చట్టపరమైన పరిణామాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మద్యం సేవించిన తర్వాత వాహనం నడపకుండా ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను వినియోగించాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు నడిపేందుకు తల్లిదండ్రులు, వాహన యజమానులు అనుమతి ఇవ్వకూడదని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. "మద్యం సేవించి వాహనం నడపవద్దు - సురక్షితంగా ప్రయాణించండి, ప్రాణాలను కాపాడుకోండి" అని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ నవీన్ కుమార్, ఎస్ఐ వేణుగోపాల్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ అరుణతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులు పాల్గొన్నారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా
మంగళవారం 22- 09- 2026
www.jaibheemtv.com


## ఎస్ఐఆర్-2026పై ప్రత్యేక

# దృష్టి సారించాలి

- ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



**హన్మకొండ, సెప్టెంబర్ 21 (జై భీమ్ న్యూస్)**

ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్--2026పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఎన్నికల విభాగం అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. అవసరమైన వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, చివరి నిమిషం వరకు ఫారం-6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటి కప్పుడు పరిశీలించి పరిష్కరించాలని, ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి వారి పని తీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ --2026కు సంబంధించిన అన్ని పనులను అక్టోబర్ 25, 2026లోపు పూర్తి చేయాలని, చివరి పది రోజులను అవసరమైన సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని తెలిపారు. ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని, ఫారం-6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు బీఎల్ఓలు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని, బీఎల్ఏలను నోటీసుల పంపిణీ ప్రక్రియలో పాల్గొననివ్వకూడదని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లను గుర్తించడంలో సహకరించవచ్చని, అయితే బీఎల్ఏల ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరఫున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని, పెండింగ్ దరఖాస్తులను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా హనుమకొండ జిల్లాలోని పరకాల నియోజకవర్గంలో అనర్హులుగా గుర్తించిన 99 మందికి తగిన కారణాలతో ఉత్తర్వులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని సీఈవో సి. సుదర్శన్ రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవికి సూచించారు. దీనిపై అదనపు కలెక్టర్ ఎన్. రవి స్పందిస్తూ సీఈవో ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేసి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



### శీతాకాలంలో విద్యార్థుల ఆరోగ్యం,
## పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

**ఏటూరునాగారం, 21 సెప్టెంబర్, (జై భీమ్ న్యూస్)**

శీతాకాలం నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ సూచించారు. ఐటీడీఏ ములుగు జిల్లా పరిధిలోని అన్ని ఆశ్రమ పాఠశాలల హెడ్‌మాస్టర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన తాజా ఆహారం అందేలా చూడడంతో పాటు పాఠశాలలు, వసతి గృహాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. శీతాకాలంలో దోమల బెడద, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మస్కిటో నెట్స్, ఇతర రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం గమనిస్తూ, ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే అవసరమైన వైద్య సేవలు అందేలా సమీపంలోని ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, హెడ్‌మాస్టర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు నిరంతరం పర్యవేక్షించాలని ప్రాజెక్ట్ ఆఫీసర్ స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశాల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డీడీ జానార్ధన్, ఆర్‌సీఓ పద్మిని, హెచ్‌ఎం గంగు పాల్గొన్నారు.

## మైనర్ కూతురిపై యువకుడు అత్యాచారం..



- దగ్గరుండి సహకరించిన కన్న తల్లి

**ఉప్పల్(జై భీమ్ న్యూస్)**

ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై యువకుడు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలు కలకలం రేపాయి. బాలిక తల్లి నిందితుడికి సహకరించి ందన్న ఆరోపణలతో పోలీసులు ఆమెను కూడా అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడి పల్లి ప్రాంతానికి చెందిన మాలోత్ రవికి బాలిక తల్లి శారదతో పరిచయం ఉంది. ఈ పరిచయంతో రవి తరచూ వారి ఇంటికి వచ్చేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో బాలిక తల్లి సహకారంతో మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందింది.ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానంటూ బాలికను నిందితుడు బెదిరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కొంతకాలంగా బాలిక ఆరోగ్యంలో మార్పులు కనిపించడంతో కుటుంబ సభ్యులు అనుమానించి వైద్య పరీక్షలు చేయించగా, బాలిక గర్భం దాల్చిన విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. బాధితురాలి తరఫున అందిన ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై మాలోత్ రవితో పాటు, నేరానికి సహకరించిందన్న ఆరోపణ లపై బాలిక తల్లి శారదను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితులిద్దరినీ కోర్టులో హాజరుపరచగా, న్యాయ స్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. మైనర్లపై లైంగిక దాడులకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి



**హన్మకొండ, సెప్టెంబర్ 21 (జై భీమ్ న్యూస్)**

కుడా పరిధిలోని మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కుడా పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతిపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను పరిశీలించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో చర్చించారు. ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్. రవి సూచించారు. దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన పత్రాలను పరిశీలించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను మండలాల వారీగా సమీక్షిస్తూ, నిబంధనల ప్రకారం పరిశీలన పూర్తి చేసి వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలనలో పత్రాలు, స్థల పరిస్థితులు, నిబంధనలకు అనుగుణంగా ఉన్న అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### వినాయక నిమజ్జనాల్లో డీజే మోతలకు
## గుండెలు అదురుతున్నాయి.?

- కేవలం రెండు రోజుల్లోనే తెలుగు రాష్ట్రాల్లో ఐదుగురు గుండెపోటుతో మరణించడం ఆందోళన కలిగిస్తోంది..




**తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ 20 సెప్టెంబర్(జై భీమ్ న్యూస్)**

నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలంలో గణేష్ శోభాయత్ర జరిగింది. శోభాయాత్రలో డ్యాన్స్ చేస్తూ రాము (34) అనే వ్యక్తి మరణించాడు. ఊరేగింపులో డ్యాన్స్ చేసి రాము గణేష్ విగ్రమం తమ ఇంటిముందుకు రాగానే మె ట్లపై కూర్చున్నాడు. కాసేపటికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. మరోవైపు శనివారం ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో వినాయక నిమజ్జనంలో డ్యాన్స్ చేస్తూ కాకర్లమూడు ఈసు అనే వ్యక్తి కుప్పకూలాడు. వినాయకుడి ఊరేగింపులు ఈసు మరికొందరు కలిసి డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా అతడు కిందపడిపోయాడు. వెంటనే అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అయి తే అప్పటికే అతడు మరణించినట్టు వైద్యులు తెలిపారు. ప్ర స్తుతం ఈసు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవు తోంది. శుక్రవారం కర్నూలు రూరల్ మండలం ఇ. తాం డ్రపాడు గ్రామంలో వినాయకనిమజ్జనం వేడుకలో డీజే శబ్ధంగా కారణంగా శివమ్మ (36) అస్వస్థతకు గురయ్యా రు. కాసేపటికే ఆమె గుండెపోటుతో మరణించారు. ఈ ఘటన జరిగినరోజే శుక్రవారం నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో మరో విషాదం చోటుచేసుకుంది. ఇందిరానగర్‌కు చెందిన గణేశ్‌గౌడ్(23) అనే యవకుడు వినాయక నిమజ్జనం వేడుకలో పాల్గొని ఇంటికి వెళ్లిన తరవాత గుం డెపోటుతో మరణించాడు.ఇక గురువారం ఉమ్మడి అనం తపురం జిల్లాలో ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ ఇద్దరు మర ణించారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లిలో శ్రీకాం త్(35) అనే యువకుడు స్నేహితులతో ర్యాలీగా వెళుతుం డగా కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు తెలిపారు. అదేరోజు అనంతపురం జిల్లా గుత్తి స్టేట్ బ్యాంకు కాలనీలో వినాయక మండపం వద్ద బుధవారం రాత్రి మైక్‌లో పాటలకు డ్యాన్స్ చేస్తూ అశోక్ కుమార్(28) అనే యువకుడు కుప్పకూలిపోయాడు. స్థానిక ఆస్పత్రికి తరలించి అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు.

**వైద్యులు ఏం చెబుతున్నారు..?**

భారీ శబ్దాలు కూడా గుండెపోటుకు కారణం కావచ్చని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా మానవుడి గుండె 60-80 డెసిబుల్స్ శబ్దాన్ని తట్టుకోగలదు. కానీ వినాయక నిమజ్జన వేడుకల్లో వాడే డీజేలు 100 నుండి 120 డెసి బుల్స్ కంటే ఎక్కువ శబ్దాన్ని ఉత్పత్తి చేస్తాయి. ఈ శబ్దానికి వచ్చే ప్రకంపనలకు గుండె లయ అస్తవ్యస్తం అవుతుంది. దానికి తోడు నిద్రలేమి, ఆయసం, శారీక శ్రమ అధికంగా ఉండటం కార్డియాక్ అరెస్ట్‌కు దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు.

**వైద్యులు హెచ్చరిస్తున్నా మారని తీరు**

అధిక శబ్దాల వల్ల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నా, డీజేలపై నిషేదం విధించినా మండపాల నిర్వహకుల తీరు మారడంలేదు. ఒకరి కంటే మరొకరు పోటీగా డీజేలను తీసుకువస్తున్నారు. కొ ంతమంది అయితే ఏకంగా ఇతర రాష్ట్రాల నుండి సైతం బ్యాండ్, డీజేలను తీసుకువస్తూ వినాయక నిమజ్జనాన్ని నిర్వహిస్తున్నారు.

## వార్డు సభ్యుల పరిస్థితి ఏమిటి?

- ప్రజలు ఎన్నుకున్నారు.. ప్రజల కోసం పనిచేస్తున్నారు..
- బాధ్యతలు ఎన్నో.. ఖర్చులు ఎన్నో.. ఆదాయం మాత్రం శూన్యం!

వార్డు సభ్యులకు కనీస గౌరవ వేతనం ఇవ్వాల్సిందే?

తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో గ్రామ పంచాయతీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గ్రామపంచాయతీ వ్యవస్థలో సర్పంచ్‌తో పాటు ప్రతి వార్డుకు ఎన్నికయ్యే వార్డు సభ్యుడు కూడా ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండే ప్రజా ప్రతి నిధి. గ్రామంలోని ప్రతి కుటుంబంతో ప్రత్యక్ష సంబంధం కలి గి ఉండే వ్యక్తి వార్డు సభ్యుడే. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా వారి దృష్టికి వెళ్లేది వార్డు సభ్యుడి వద్దకే.తాగునీరు కావచ్చు.. వీధిలైట్లు కావచ్చు.. పారిశుధ్యం కావచ్చు.. డ్రైనేజీ సమస్య కావచ్చు.. రోడ్ల సమస్య కావచ్చు.. పింఛన్లు, రేషన్, ప్రభుత్వ పథకాలు, ఇళ్ల సమస్యలు, మురుగు కాలువలు, దో మల నివారణ, చెత్త సేకరణ వంటి అనేక ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే బాధ్యతలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకం.

**అయితే ఇన్ని బాధ్యతలు నిర్వహిస్తున్న వార్డు సభ్యుల ఆర్థిక పరిస్థితి ఏమిటి?**

ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న తర్వాత వార్డు సభ్యుడు ఐదేళ్ల పాటు ప్రజల మధ్య ఉండాలి. ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగిన వ్యక్తి, గెలిచిన తర్వాత కూడా అదే ప్రజల సమస్యల కోసం తిరగాల్సి ఉంటుంది. కానీ ప్రజల కోసం తిరిగే సమయంలో అయ్యే ప్రయాణ ఖర్చులు, ఫోన్ ఖర్చులు, సమావేశాలకు వెళ్లే ఖర్చులు, అధికారులను కలవ డానికి అయ్యే ఖర్చులు, ఇతర ప్రజా కార్యక్రమాల ఖర్చులు ఎవరు భరించాలి అనే ప్రశ్న మాత్రం ఇప్పటికీ స్పష్టమైన సమాధానం కోసం ఎదురుచూస్తోంది.

**బాధ్యతలు ప్రజాప్రతినిధివి.. ఖర్చులు మాత్రం వ్యక్తిగతమా?**

ఒక గ్రామంలో సమస్య ఏర్పడితే ప్రజలు ముందుగా తమ వార్డు సభ్యుడిని ఆశ్రయిస్తారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు అధికారులను కలవాలని, పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలని, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడాలని ప్రజ లు కోరుతారు.అంటే వార్డు సభ్యుడి పదవి కేవలం సమా వేశాలకు హాజరయ్యే పదవి కాదు. ప్రజల మధ్య నిరంతరం ఉండే బాధ్యత కలిగిన పదవి.కానీ ప్రజల కోసం పనిచేసే ఈ ప్రజాప్రతినిధులకు సరైన ఆర్థిక భరోసా లేకపోవడం వల్ల అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజాసేవ చేయాలంటే కనీసం ప్రయాణ ఖర్చులు, సమావేశ ఖర్చులు, ప్రజా సమస్యల కోసం తిరిగే ఖర్చులు అయినా ప్రభుత్వం భరించాలి కదా?

**వార్డు సభ్యుడి సేవకు విలువ లేదా?**

ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు మాత్రమే సరిపోవు. ఆ నిధులతో పనులు సక్రమంగా జరుగుతున్నాయా? ప్రజలకు అవసరమైన పనులు జరుగుతున్నాయా? అనే విషయాలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజల తరఫున ప్రశ్నించాల్సి ఉంటుంది.ఈ క్రమంలో వార్డు సభ్యులు తమ వార్డులోని ప్రజల సమస్యలను పంచాయతీ సమావేశాల్లో ప్రస్తావిస్తారు. అభివృద్ధి పనులపై చర్చిస్తారు. ప్రజల సమస్య లను అధికారుల దృష్టికి తీసుకెళ్తారు.

**మరి ఇంతటి బాధ్యత కలిగిన పదవికి కనీస గౌరవ వేతనం ఉండకూడదా?**

ప్రజల కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ వారి సేవలకు తగిన గుర్తింపు, గౌరవం, ఆర్థిక భరోసా అవసరమే. అదే విధంగా వార్డు సభ్యుల విషయంలో కూడా ప్రభుత్వం సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందనే డిమాండ్ పెరుగుతోంది.

**ఐదేళ్లు ప్రజాసేవ.. కుటుంబ బాధ్యతలు ఎలా?**

వార్డు సభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి కూడా ఒక కుటుంబానికి బాధ్యత వహించే వ్యక్తే. అతనికి కుటుంబ అవసరాలు ఉం టాయి. పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇంటి ఖర్చులు, ప్ర యాణ ఖర్చులు ఇలా ఎన్నో బాధ్యతలు ఉంటాయి.అలాంటి సమయంలో ప్రజా సమస్యల కోసం తన సమయం కేటాయి స్తూ, అధికారుల చుట్టూ తిరుగుతూ, తన సొంత డబ్బును ఖర్చు చేస్తూ ప్రజాసేవ చేయడం ఎంతకాలం సాధ్యమ వుతుంది?ప్రజాసేవ చేయాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెనుకడుగు వేసే పరిస్థితి రాకుండా ప్రభుత్వం వార్డు సభ్యులకు కనీస ఆర్థిక భరోసా కల్పించాలి.

**కనీస గౌరవ వేతనం ఇవ్వాలి**

తెలంగాణ ప్రభుత్వం వార్డు సభ్యుల పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించి, వారి పదవీకాలానికి అనుగుణంగా ప్రతి నెలా కనీస గౌరవ వేతనం అందించే విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ వినిపిస్తోంది.దీనితో పాటు సమావేశాలకు హాజరయ్యే సమయంలో సమావేశ భత్యం, ప్రయాణ భత్యం వంటి సౌకర్యాలను కూడా కల్పించాలని కోరుతున్నారు.వార్డు సభ్యుల బాధ్యతలు, గ్రామ జనాభా, వారి ప్రజా సేవలో ఖర్చవుతున్న సమయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తగిన మొత్తాన్ని నిర్ణయించవచ్చు.

**వార్డు సభ్యులకు కనీస వేతనం ఎందుకు అవసరం?**

వార్డు సభ్యులకు కనీస గౌరవ వేతనం కల్పించడం వల్ల ప్రజాసేవను మరింత బాధ్యతగా కొనసాగించేందుకు ఆర్థిక భరోసా లభిస్తుంది. ప్రజల సమస్యలపై నిరంతరం దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. అధికారులను కలవడానికి అయ్యే కనీస ఖర్చులకు కొంతమేర సహాయం లభిస్తుంది.అంతేకాకుండా గ్రామస్థాయి ప్రజాస్వామ్యంలో పనిచేస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవానికి ఇది ఒక గుర్తింపుగా నిలుస్తుంది.

**ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి**

వార్డు సభ్యుల సమస్యలపై ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో వారి బాధ్యతలు, ప్రస్తుత భత్యాలు, వాస్తవంగా అయ్యే ఖర్చులు, ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలి.ఆ అధ్యయనం ఆధారంగా తెలంగాణలో వార్డు సభ్యులకు గౌరవ వేతనం, సమావేశ భత్యం, ప్రయాణ భత్యం, అవసరమైన ఇతర సౌకర్యాలపై స్పష్టమైన విధానం రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రజల గొంతుకగా నిలిచే వార్డు సభ్యులకు ప్రభుత్వం అండగా నిలవాలి**

వార్డు సభ్యుడు ప్రజల మధ్య ఉండే వ్యక్తి. ప్రజల సమస్యలను ముందుగా వింటాడు. వాటిని పంచాయతీ దృష్టికి తీసుకెళ్తాడు. అవసరమైతే అధికారుల వద్దకు తీసుకెళ్తాడు.అందుకే వార్డు సభ్యులను కేవలం ఎన్నికల సమయంలో గుర్తుచేసుకునే ప్రజాప్రతినిధులుగా కాకుండా గ్రామస్థాయి ప్రజాస్వామ్యానికి ముఖ్యమైన భాగస్వాములుగా ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉంది.ప్రజల ఓట్లతో ఎన్నికై ఐదేళ్ల పాటు ప్రజల కోసం పనిచేసే వారికి కనీస గౌరవ వేతనం ఇవ్వడం ద్వారా ప్రభుత్వం వారి సేవలకు గుర్తింపు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

**"ప్రజల కోసం పనిచేసే వార్డు సభ్యుడికి కనీస భరోసా ఎక్కడ?"**

గ్రామాభివృద్ధి గురించి మాట్లాడుతున్న ప్రభుత్వం, గ్రామస్థాయి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, ప్రజల సమస్యలను నేరుగా మోసుకెళ్లే వార్డు సభ్యుల ఆర్థిక పరిస్థితిపై కూడా దృష్టి పెట్టాలి.బాధ్యతలు అప్పగించి.. ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. అదే సమయంలో వారి సేవకు సరైన ఆర్థిక భరోసా లేకుండా ఉంచడం ఎంతవరకు సమంజసం?ఈ ప్రశ్నకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.వార్డు సభ్యులకు కనీస గౌరవ వేతనం, ప్రయాణ భత్యం, సమావేశ భత్యం వంటి సౌకర్యాలను కల్పించి వారి సేవలకు గుర్తింపు ఇవ్వాలని ప్రజలు, వార్డు సభ్యులు కోరుతున్నారు.

- ప్రజల ఓటుతో గెలిచిన ప్రతి వార్డు సభ్యుడికి గౌరవం ఉండాలి..
- ప్రజల కోసం పనిచేసే ప్రతి వార్డు సభ్యుడికి ఆర్థిక భరోసా ఉండాలి..
- గ్రామ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే వార్డు సభ్యుల సేవలను ప్రభుత్వం గుర్తించాలి..



రఘు గొర్రెకుంట 8వ వార్డు మెంబర్
గ్రామం జమాల్ పురం
మండలం పర్వతగిరి జిల్లా వరంగల్

## అంబాల, లక్ష్మీపూర్ గ్రామాల్లో

# ఉచిత వైద్య శిబిరం..

**- 78 మందికి వైద్య పరీక్షలు**

**కమలాపూర్, 21 సెప్టెంబర్,జై భీమ్ న్యూస్)**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమలాపూర్ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో అంబాల (గొల్లపల్లి) యాదవ సంఘం వద్ద సోమవారం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడంతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో శిబిరానికి వచ్చిన వారికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి అవసరమైన సూచనలు అందించడంతో పాటు, అవసరమైన వారి నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. పరీక్షల అనంతరం వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రై డే యాక్టివిటీ నిర్వహించి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులతో పాటు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది తెలిపారు. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు తదితర అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు సొంత వైద్యం చేసుకోకుండా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తాగునీటి పరిశుభ్రత, ఇంటి పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా దోమల నివారణకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. డాక్టర్ మానస మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు సొంత వైద్యం చేసుకోకుండా వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. అంబాల గ్రామ సర్పంచ్ కుమారస్వామి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కోరారు. లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ కౌడగాని రాజేష్ మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందించడం వల్ల గ్రామస్థులకు ఎంతో ప్రయోజనం కలిగిందని తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలకు సహకారం అందిస్తామని అన్నారు. ఉప సర్పంచ్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ముఖ్యంగా దోమల నివారణ,

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని, ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలు కొనసాగేందుకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబాల గ్రామ సర్పంచ్ కుమారస్వామి, ఉప సర్పంచ్ శ్రవణ్ కుమార్, లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ కౌడగాని రాజేష్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు పాల్గొని వైద్య శిబిరం నిర్వహణను పరిశీలించారు. అలాగే డాక్టర్లు నాగరాజు, రోహిత్, మానస, ఏఎన్ఎంలు సంపూర్ణ, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఆశా కార్యకర్తలు అనిత, రమ, శ్రీమతి, కవిత, షన్ను తదితర వైద్య సిబ్బంది పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో వైద్య శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని ఉచిత మందులను పొందారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని గ్రామస్థులు కోరారు.







## హసన్‌పర్తి మండల ప్రజావాణికి 7 దరఖాస్తులు

**- 23 మంది మండల స్థాయి అధికారులకు హాజరు**

**- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారుల గైర్హాజరు**

**హసన్‌పర్తి, సెప్టెంబర్ 21 (జై భీమ్ న్యూస్)**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపించేందుకు హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ శాఖలకు చెందిన మొత్తం 23 మంది మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 7 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 4 దరఖాస్తులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ( జిడబ్ల్యుఎంసి)కు 1, ఎక్సైజ్ శాఖకు 1, ఎంపీఓకు 1 దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం వినతిపత్రాలను సమర్పించారు. ఆయా దరఖాస్తులను సంబంధిత అధికారులు స్వీకరించి, సమస్యల వివరాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అయితే మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖతో పాటు పోలీస్ శాఖకు చెందిన అధికారులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలు తమ సమస్యలను నేరుగా సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో, అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు లేకుండా, ఒకే వేదికపై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిపై తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## పంటలను ఎండబెడుతున్న

# పాపం కాంగ్రెస్‌దే

**సూర్యాపేట, సెప్టెంబర్ 21, (జై భీమ్ న్యూస్) :**



రైతులకు పంటలను దూరం చేస్తున్న పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలం నూర్జహాన్ పేట, గూడెపుకుంట తండా గ్రామాలలో ఎండిన పంటపొలాలను సందర్శించారు. రైతులతో ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకొని మీడియాతో మాట్లాడారు. ఏ గ్రామంలో చూసినా వందల ఎకరాలు ఎండిపోయినయ్. కాలం పరిస్థితి చూసే రైతులు సగం పొలాలే నాటుపెట్టుకున్నరు. అందులోనూ సగం పైన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లుగా పరిస్థితి మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.నీళ్లు, కరెంట్ పుష్కలంగా ఉన్నా కాంగ్రెస్‌కు పాలన చేతకాక పంటలు ఎండబెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటును కూడా సరిగ్గా ఇవ్వలేక మోటర్లు కాలిపోయే దుస్థితి నెలకొంది. రైతుల పట్ల రేవంత్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పంటలు చేతికొచ్చే సమయంలో కావాలనే పంటలను ఎండబెడుతున్నరు. రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం ముందుకు సాగలేదన్నారు. ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ దయ్యం, రేవంత్ భూతం పట్టింది.ఆ దయ్యాలు, భూతాలను ఎట్లా వదిలించాలో రైతులకు తెలుసన్నారు. ప్రశ్నిస్తే తప్ప ఈ ప్రభుత్వానికి కనికరం ఉండదు. కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని సాధించుకొని పదేండ్లు సస్య శ్యామలంగా పంటలు పండించుకున్నం. మరో మారు పంటలు కాపాడుకునేందుకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని, మంత్రులను హెచ్చరిస్తున్నా.. ఇదే పరిస్థితిలో కొనసాగిస్తే రైతులు మీ వెంట పడటం ఖాయమన్నారు. కెసిఆర్, కేటీఆర్, హరీశ్ రావు మీద, నా మీద దాడులు చేస్తే ఎండిపోయిన పొలాలు మర్చిపోతయా? మీ డైవర్షన్ పాలిటిక్స్ తో ప్రజల ఇబ్బందులు తొలిగిపోతాయా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని పంటలకు నీళ్లు, కరెంట్ పై దృష్టి పెడితే మంచిది. లేదంటే ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని హెచ్చరించారు.



## 108 ప్రసాదాలతో సాక్షి గణపతికి ఘనంగా నైవేద్యం

**- ఆటపాటలతో సందడిగా గణపతి నవరాత్రి ఉత్సవాలు.. పండుగ వాతావరణంలో ప్రేమ్‌నగర్ కాలనీ**

**హన్మకొండ, సెప్టెంబర్ 21 (జై భీమ్ న్యూస్)**



ప్రేమ్‌నగర్ కాలనీలో సాక్షి గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాలనీవాసులు 108 రకాల ప్రసాదాలను స్వయంగా తయారు చేసి సాక్షి గణపతికి భక్తిశ్రద్ధలతో నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటల కార్యక్రమాలతో మండపం వద్ద సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గణపతి మండపం మొత్తం గణపతి నామస్మరణతో మారుమోగింది. మహిళలు, చిన్నారులు, భక్తులతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రేమ్‌నగర్ కాలనీ ప్రెసిడెంట్, కాలనీ కమిటీ సభ్యులు ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చిన్నారులు, మహిళలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొనేలా ఆటపాటల కార్యక్రమాలతో పాటు లక్కీ డ్రా నిర్వహిస్తూ విజేతలకు బహుమతులను అందజేస్తున్నారు. దీంతో ఉత్సవాల్లో పాల్గొంటున్న కాలనీవాసుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. కుటుంబ సమేతంగా గణపతి మండపానికి చేరుకున్న భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కాలనీవాసులందరి సహకారంతో గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. భక్తి, ఐక్యత, ఆనందోత్సాహాల మధ్య కొనసాగుతున్న ఉత్సవాలతో ప్రేమ్‌నగర్ కాలనీ మొత్తం పండుగ శోభను సంతరించుకుంది.

## నిత్యావసర వస్తువుల ధరల

# పెరుగుదలను నియంత్రించాలి

**- రేషన్ షాపుల ద్వారా 13 రకాల నిత్యావసర వస్తువులు అందించాలి : ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగాల రాగసుధ**

**హన్మకొండ, సెప్టెంబర్ 21 (జై భీమ్ న్యూస్)**






నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే నియంత్రించాలని, రేషన్ షాపుల ద్వారా ప్రజలకు 13 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వంగాల రాగసుధ డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వంగాల రాగసుధ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్య ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. బియ్యం, పప్పులు, వంట నూనెలు, కూరగాయలు, పాలు, గుడ్లు తదితర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ధరల పెరుగుదల ప్రభావాన్ని మహిళలే ఎక్కువగా ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుటుంబ బడ్జెట్‌ను నిర్వహించే బాధ్యత ఎక్కువగా మహిళలపై ఉండటంతో ధరలు పెరిగిన ప్రతిసారీ కుటుంబ అవసరాల్లో కోతలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. పిల్లల పోషకాహారం, విద్య, వైద్యం, దుస్తులు వంటి అవసరాలపై కూడా ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయల ధరలు పెరిగితే కూరలో కోత, పప్పుల ధరలు పెరిగితే పప్పులో కోత, వంట నూనెల ధరలు పెరిగితే వంటకాలపై పరిమితులు విధించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ఇది కేవలం ధరల పెరుగుదల సమస్య మాత్రమే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న అంశమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని, మార్కెట్ ధరల నియంత్రణలో నిర్లక్ష్యం కారణంగా దళారులు, అక్రమ నిల్వదారులు, అధిక లాభాల కోసం వ్యవహరించే వ్యాపారుల వల్ల ప్రజలపై అదనపు భారం పడుతోందని ఆమె అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు 13 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఏఐఎఫ్‌డీడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నబోయిన ప్రేమలత, ప్రత్యూష, జిల్లా కమిటీ సభ్యులు ఏన్.రెడ్డి రాజేంద్ర, గడ్డం సుధారాణి, అరుణ, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల పోరాటం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21, జైభీమ్‌న్యూస్:**

సాగు నీళ్ల కోసం రైతుల తాపత్రయం కన్నీళ్లు తెప్పిస్తుంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అమరచింత జూరాల కింద ఎడమ కాలువలకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో పోలీసు బలగాలు జూరాల ప్రాజెక్టు మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీన్ని నిరసిస్తూ రైతాంగం ఎలాగైనా సాగునీళ్లు కావాలని చెప్పి ఏకంగా ప్రాణాలకు తెగించి కాలువలోకి దిగి జూరాల రెగ్యులేటర్ కి చేరుకునేందుకు చేస్తున్న ప్రయత్నం తీవ్ర కలకలం రేపింది. మరోవైపు బీఆర్ఎస్ నాయకులు జూరాల ప్రాజెక్టుపై రైతులతో కలిసి ధర్నాకు పిలుపునిస్తే మాజీ మంత్రులతో సహా మాజీ ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు రైతులు పెద్ద ఎత్తున జూరాల ప్రాజెక్టుకు తరలి రావడానికి ప్రధాన రహదారులను వదిలి పొలాల వెంబడి కాళ్లు నడకన పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. పోలీసులు ప్రతిఘటించి అదుపులోకి తీసుకుంటున్న రైతాంగ మాత్రం సాగునీటి కోసం తీవ్ర ఆవేదన చెందుతుంది. ఈ లోపు జూరాల ఎడమ కాలువలోకి రైతులు దిగి ప్రాణాలకు తెగించి చేస్తున్న సాహసోపేతమైన పోరాటం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతి ఒక్కరిని కదిలిస్తున్నది.ఇదిలా ఉండగా ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులు ఇప్పటివరకు నీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైతుల్లో అసహనం పెరుగుతోంది. మరోవైపు కోయిల్ సాగర్ కింద కూడా కాలువలకు నీళ్లు విడుదల చేయాలని.. సంగం బండ రిజర్వాయర్ కింద కూడా నీళ్లు విడుదల చేయాలని రైతాంగం డిమాండ్ చేస్తుండడంతో మరో నీటి పోరాటానికి తెర లేపుతోంది. అలాగే శ్రీశైలం ప్రాజెక్టులో సుమారు 100 టీఎంసీల వరకు నీళ్లు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఎత్తిపోయకుండా ఆంధ్రాకు నీళ్లు వెళ్లేలా చేస్తుంది. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులు తీవ్రంగా రగిలిపోతున్నారు.





## హసన్‌పర్తి, మల్లారెడ్డిపల్లిలలో పీఏసీఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

**- ఘనంగా నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారోత్సవాలు**

**- రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తాం**

హసన్‌పర్తి, సెప్టెంబర్ 21 (జై భీమ్ న్యూస్)

హసన్‌పర్తి మండలంలోని హసన్‌పర్తి, మల్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ గ్రేన్ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలకవర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు. మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా బయ్యగాని కుమారస్వామి బాధ్యతలు స్వీకరించగా, పాలకవర్గ సభ్యులుగా కేతపాక రత్నాకర్, చికట్ల కుమారస్వామి, గాజు ఇలుకమురి, కోలా సురేష్, తాళ్లపల్లి ఆనందం, బొక్క చేరాలు, గోగుల తిరుపతి రెడ్డి, తాబేటి భారతి, పిట్టల రాజు, అరుకొండ నవీన్, తిక్క శైలజ, నూనావత్ లింగు ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్‌గా పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి బాధ్యతలు స్వీకరించగా, పాలకవర్గ సభ్యులుగా రామంచ ప్రబాకర్, గోలి వెంకటరంగారెడ్డి, వట్టె శ్రీనివాస్ రెడ్డి, వెన్నపురెడ్డి రాయపురెడ్డి, గడం శ్రీధర్, నేదునూరి రాదమ్మ, జనగాని నవీన్ కుమార్, సైనీ రామరాజు, జనగాని దయాకర్, గొర్రె మల్లికాంబ, బిగుళ్ల లింగయ్య, పాలకుర్తి రాములు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్లు, డైరెక్టర్లు, పాలకవర్గ సభ్యులను ముఖ్య అతిథులు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని, రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమన్నారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర సేవలు అందేలా నూతన పాలకవర్గాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. గ్రేన్ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు సరైన ధర లభించేలా మార్కెట్ వ్యవస్థతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. పంటల కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలు క్షేత్రస్థాయిలో చేరేలా పీఏసీఎస్‌లు కీలకపాత్ర పోషించాలని సూచించారు. హసన్‌పర్తి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాకేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ముఖ్యమన్నారు. రైతులకు అవసరమైన సేవలను అందించడంలో నూతన పాలకవర్గాలు చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పీఏసీఎస్‌ల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. రైతులకు అవసరమైన సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకువచ్చి సహకార సంఘాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో సహకార శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు బాలుడు మృతి

గద్వాల, సెప్టెంబర్ 21, (జై భీమ్ న్యూస్)



జోగులాంబ గద్వాల జిల్లాలో సోమవారం సాయంత్రం పిడుగు పడి 16 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. కేటీ దొడ్డి మండలం యర్సన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్ కు మారుడు మల్లేష్ (16) పొలం నుంచి ఇంటికి వస్తుండగా వర్షం కురిసింది. దీంతో కృష్ణస్వామి దేవాలయం సమీపంలోని చెట్టు కిందకు వెళ్లి నిల్చున్నాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన
# జీవనశైలిని అలవర్చుకోవాలి

**- అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన సదస్సులో వైద్య నిపుణుల సూచనలు**

రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 21, జై భీమ్ న్యూస్

ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు అల్జీమర్స్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స, కుటుంబ సభ్యుల పాత్రపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్దీ కొంత మతిమరుపు సహజమే అయినప్పటికీ, రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే స్థాయిలో జ్ఞాపకశక్తి, ఆలోచన, నిర్ణయ సామర్థ్యం తగ్గడం సాధారణ వృద్ధాప్య లక్షణం కాదని తెలిపారు. అల్జీమర్స్‌తో పాటు డిమెన్షియా ప్రమాదాన్ని తగ్గించేందుకు చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం, సామాజిక సంబంధాలను కొనసాగించడం, తగినంత నిద్రపోవడం, మానసిక ఒత్తిడిని నియంత్రించుకోవడం మెదడు ఆరోగ్యానికి ఉపయోగకరమని పేర్కొన్నారు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, అధిక బరువును నియంత్రించడం కూడా ముఖ్యమని తెలిపారు. న్యూరో ఫిజిషియన్ డా. నీలిమ మాట్లాడుతూ అల్జీమర్స్ వ్యాధి వచ్చే కారణాలు, డిమెన్షియాలోని వివిధ రకాలు, ప్రారంభ లక్షణాలు, అవసరమైన వైద్య పరీక్షలు, వ్యాధిగ్రస్తులకు కుటుంబ సభ్యులు అందించాల్సిన సహకారం గురించి వివరించారు. నిరంతర మతిమరుపు, పరిచయమైన వ్యక్తులను గుర్తించలేకపోవడం, రోజువారీ పనులు చేయడంలో ఇబ్బంది, ప్రవర్తనలో మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సైకియాట్రీ విభాగానికి చెందిన డా. అన్నపూర్ణ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాన్ని చిన్న వయస్సు నుంచే కాపాడుకోవాలని, ఒత్తిడిని తగ్గించుకోవడం, తగిన విశ్రాంతి తీసుకోవడం, సామాజిక అనుబంధాలను కొనసాగించడం, అవసరమైనప్పుడు కౌన్సెలింగ్ పొందడం ముఖ్యమని తెలిపారు. న్యూరోసర్జన్ డా. కె.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ అల్జీమర్స్ వ్యాధికి ప్రస్తుతం పూర్తిస్థాయి నివారణ చికిత్స అందుబాటులో లేకపోయినా, ప్రమాద కారకాలను తగ్గించడం, వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడం, లక్షణాలను నియంత్రించడం, కుటుంబ సభ్యుల సహకారంతో బాధితుల జీవన నాణ్యతను మెరుగుపరచడం సాధ్యమని తెలిపారు. సైకియాట్రీ విభాగానికి చెందిన డా. రామారెడ్డి మాట్లాడుతూ అల్జీమర్స్‌ను కేవలం వ్యక్తిగత వ్యాధిగా కాకుండా వ్యక్తి, కుటుంబం, సమాజంపై ప్రభావం చూపే ప్రజారోగ్య సమస్యగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధిగ్రస్తులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం, ఇంట్లో పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడం, అవసరమైనప్పుడు కర్ర లేదా ఇతర సహాయక పరికరాలను వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. కె.వి. శివప్రసాద్ మాట్లాడుతూ భారతీయ కుటుంబ వ్యవస్థలో వృద్ధులకు కుటుంబ సభ్యుల ప్రేమ, భద్రత, నిరంతర పర్యవేక్షణ లభించడం అల్జీమర్స్ బాధితులకు ఎంతో సహాయకరంగా ఉంటుందని అన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన డా. వి.వి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వ్యాధి తీవ్రత పెరిగినప్పుడు బాధితులు కుటుంబ సభ్యులను, పరిచయస్తులను కూడా గుర్తించలేని పరిస్థితి ఏర్పడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ మెదడు ఆరోగ్యాన్ని కాపాడే జీవనశైలిని పాటిస్తూ అల్జీమర్స్ ప్రమాదాన్ని తగ్గించే చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు సమన్వయాధికారి డా. బి. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ అల్జీమర్స్‌తో సహా డిమెన్షియా ప్రపంచవ్యాప్తంగా వ్యక్తులు, కుటుంబాలు, ఆరోగ్య వ్యవస్థలపై ప్రభావం చూపుతున్న సమస్యగా మారిందని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. 85 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ముగ్గురిలో ఒకరికి అల్జీమర్స్ ఉండే అవకాశం ఉందని వివరించారు. క్రమం తప్పకుండా నడక, వ్యాయామం వంటి శారీరక చురుకుదనం కొనసాగించడం, పోషకాహారం తీసుకోవడం, అధిక చక్కెర, సంతృప్త కొవ్వులు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని పరిమితం చేయడం, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, అధిక బరువును నియంత్రించుకోవడం అవసరమని తెలిపారు. పొగాకు వినియోగం, హానికరమైన మద్యపానాన్ని నివారించడంతో పాటు ఒంటరితనాన్ని తగ్గించుకోవడం, తగినంత నిద్ర, మానసిక ప్రశాంతతను పాటించడం కూడా ముఖ్యమని వివరించారు. ఈ సందర్భంగా డా. అన్నపూర్ణ కార్యక్రమంలో పాల్గొన్న వారితో అల్జీమర్స్ వ్యాధి ప్రమాదాన్ని తగ్గించే ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తూ, వ్యాధిగ్రస్తులకు గౌరవం, సహకారం అందిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డా. ఎ. రమేష్ బాబు, ఫోరెన్సిక్ మెడిసిన్, డా. మోహన్ చంద్రన్, పీడియాట్రిక్స్, డా. జ్యోతిలత, బయోకెమిస్ట్రీ విభాగంతో పాటు ఇతర విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పారామెడికల్ కళాశాల విద్యార్థులు, ప్రియదర్శిని నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.






## గొర్రెలు, మేకల కాపరులకు నెలకు
# రూ.5 వేల పింఛన్ ఇవ్వాలి



**- మేత, నీరు, వైద్యం సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**- రూ.2 లక్షల నగదు బదిలీ హామీని వెంటనే అమలు చేయాలి**

**- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు**

హనుమకొండ జిల్లా/హసన్‌పర్తి, (జై భీమ్ న్యూస్)

50 సంవత్సరాలు దాటిన గొర్రెలు, మేకల పెంపకందారులందరికీ నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఎదుర్కొంటున్న మేత, నీరు, వైద్యం, రుణాలు, గొర్రెల పంపిణీ తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ధర్మసాగర్ మండల ప్రజా పరిషత్ అధికారి కే. అనిల్ కుమార్, హసన్‌పర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుమన వాణికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల రమేష్ మాట్లాడుతూ, గొర్రెలు, మేకల పెంపకం వృత్తిపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. పెంపకందారులు తమ కుటుంబాలను పోషించుకోవడంతో పాటు సమాజానికి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు అనేక ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నాయని అన్నారు. గొర్రెలు, మేకలకు మేత కోసం పెంపకందారులు ప్రతిరోజూ సుమారు 20 నుంచి 30 కిలోమీటర్ల వరకు తిరుగుతూ తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. ఎండ, వాన, చలి అనే తేడా లేకుండా జీవాలను సంరక్షించాల్సి వస్తోందన్నారు. సంవత్సరాల తరబడి ఎక్కువ దూరం నడవడం వల్ల అనేక మంది కాపరులు చిన్న వయసులోనే మోకాళ్లు, కీళ్ల సమస్యలకు గురవుతున్నారని చెప్పారు. అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత లేక అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో కూడా గొర్రెలు, మేకల పెంపకాన్ని కొనసాగిస్తూ కుటుంబాలను పోషించాల్సిన పరిస్థితి ఉందని రమేష్ తెలిపారు. అందువల్ల 50 సంవత్సరాలు దాటిన ప్రతి గొర్రెలు, మేకల పెంపకందారుడికి నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇతర వృత్తిదారులకు అందుతున్న సామాజిక భద్రత తరహాలో గొర్రెలు, మేకల పెంపకందారులకు కూడా ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గొర్రెలు, మేకలకు అవసరమైన మేత, తాగునీరు అందుబాటులో లేక పెంపకందారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీవాలకు వ్యాధులు సోకినప్పుడు సకాలంలో వైద్యం అందేలా గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలను బలోపేతం చేయాలని కోరారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచడంతో పాటు పెంపకందారులకు రుణ సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గొర్రెల పంపిణీ పథకానికి బదులుగా రూ.2 లక్షల నగదు బదిలీ ద్వారా అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి పెంపకందారుడికి పారదర్శకంగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పింఛన్, మేత, నీరు, వైద్యం, రుణాలు, నగదు బదిలీ తదితర అంశాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య షెఫర్డ్, జిల్లా ఉపాధ్యక్షుడు జి. సమ్మయ్య, ధర్మసాగర్ మండల అధ్యక్షుడు తొట్టె భీమన్న, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు భాషబోయిన ఓదెలు, మండల కార్యదర్శి పిడుగు రాజన్న, ఉపాధ్యక్షుడు కాసాని పరుశురాములు, సహాయ కార్యదర్శి దాసరి నాగరాజు, స్వామి ఓదెలు, తూము కుమారస్వామి, రాజేందర్, సీహెచ్. కుమారస్వామి, పరుశురాములు, పూజలు, ఎన్. కొమురయ్య, కుమారస్వామి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు సీఐలు సస్పెండ్..?

హైదరాబాద్, సెప్టెంబర్ 21, జై భీమ్ న్యూస్:

వరుస వివాదాలు, ఇన్‌స్పెక్టర్ల సస్పెన్షన్లతో వార్తల్లో నిలిచిన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు ఎట్టకేలకు కొత్త ఇన్‌స్పెక్టర్ నియమితులయ్యారు. డి.అశోక్‌ను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు వేర్వేరు వ్యవహారాల్లో సస్పెండ్ కావడంతో కొత్త నియామకంపై కొంతకాలంగా పోలీస్ శాఖలో కసరత్తు జరిగింది. తాజా నియామకంతో అశోక్ స్టేషన్ బాధ్యతలు చేపట్టనున్నారు. అశోక్ కంటే ముందు ఎం.ముత్తు యాదవ్ జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అంతకుముందు యూ. శ్రీనివాసులు రెడ్డి ఈ బాధ్యతల్లో ఉండేవారు. జూలైలో శ్రీనివాసులు రెడ్డిని సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో ముత్తు యాదవ్‌ను నియమించారు. అయితే యాదవ్ బాధ్యతలు చేపట్టిన సుమారు మూడు వారాల్లోనే ఆయనపై కూడా సస్పెన్షన్ వేటు పడింది. ముత్తు యాదవ్ సస్పెన్షన్‌కు మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ ఎన్.సుమంత్‌కు సంబంధించిన కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం ప్రధాన కారణంగా అధికారులు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో రియల్టర్ జి.హరికృష్ణపై దాడి జరిగిన ఘటనలో సుమంత్, అతని అనుచరులపై ఫిర్యాదు వచ్చింది. హరికృష్ణకు గాయాలు కావడంతో మొదట మెడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బాధితుడు గాయాలతో పోలీసులను ఆశ్రయించినప్పటికీ వెంటనే స్పందించలేదని, దీంతో అతను మరో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని ఆరోపణలు వచ్చాయి. కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, ప్రధాన నిందితుడిగా పేర్కొన్న సుమంత్‌ను గుర్తించి అరెస్టు చేయడంలోనూ ఇన్‌స్పెక్టర్ స్థాయిలో నిర్లక్ష్యం జరిగిందని ఉన్నతాధికారులు భావించారు. ఈ కేసులో సుమంత్‌కు చెందిన ముగ్గురు అనుచరులు అరుణ్, మహేందర్, కార్తీక్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో విధి నిర్వహణలో లోపాలు ఉన్నాయన్న నిర్ధారణకు వచ్చిన తర్వాత ముత్తు యాదవ్‌పై సస్పెన్షన్ చర్య తీసుకున్నారు. ముత్తు యాదవ్‌కు కంటే ముందు జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా యూ.శ్రీనివాసులు రెడ్డి పనిచేశారు. 2026 జూలైలో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. ఓ మహిళ చేసిన ఫిర్యాదులో లైంగిక వేధింపులు, డబ్బులు డిమాండ్ చేయడం, అధికార దుర్వినియోగం వంటి తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ప్రాథమిక అంతర్గత విచారణ అనంతరం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కుటుంబ సమస్యపై పోలీసులను ఆశ్రయించిన సమయంలో శ్రీనివాసులు రెడ్డితో పరిచయం ఏర్పడిందని, ఆ తర్వాత తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో మహిళ ఆరోపించింది. తనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను రహస్యంగా చిత్రీకరించి వాటిని చూపిస్తూ బెదిరించారని, డబ్బులు డిమాండ్ చేశారని కూడా ఆమె ఆరోపణలు చేసింది. దీంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించించి శ్రీనివాసులు రెడ్డిని సస్పెండ్ చేశారు. ఇలా వరుసగా ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సస్పెండ్ అయిన నేపథ్యంలో జూబ్లీహిల్స్ స్టేషన్‌కు డి.అశోక్ కొత్త సీఐగా నియామకం కావటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రముఖుల నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాలు, సినీ పరిశ్రమకు సంబంధించిన కీలక ప్రాంతాలు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నాయి.


# సుకుమార్ శిష్యులకు 'ద్వితీయ విఘ్నం' టెన్షన్..!

**జై భీమ్ న్యూస్, సినిమా :**

టాలీవుడ్‌లో దర్శకుడు సుకుమార్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆయన వద్ద పనిచేసి దర్శకత్వంలోకి వచ్చిన పలువురు యువ దర్శకులు తమదైన శైలిలో సినిమాలు చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా సహజత్వం, రా అండ్ రస్టిక్ కథనాలు, బలమైన భావోద్వేగాలతో సినిమాలను తెరకెక్కించడం సుకుమార్ శిష్యుల పనితీరులో కనిపించే అంశాలుగా మారాయి. అయితే తొలి సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న దర్శకులు రెండో సినిమాతో అదే స్థాయిలో మెప్పిస్తారా? అనే చర్చ ఎప్పటి నుంచో సినీ వర్గాల్లో ఉంది.ప్రస్తుతం ఈ చర్చ సుకుమార్ శిష్యులు బుచ్చిబాబు సానా, శ్రీకాంత్ ఓదెల చుట్టూ తిరుగుతోంది. తొలి సినిమాలతో మంచి విజయాలు అందుకున్న ఈ ఇద్దరు దర్శకులు తమ రెండో చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.బుచ్చిబాబు సానా 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయనకు టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా 'పెద్ది' అనే భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కించే అవకాశం దక్కింది.భారీ అంచనాల మధ్య విడుదలైన 'పెద్ది'లో రామ్ చరణ్ నటనకు ప్రశంసలు దక్కాయి. అయితే కథనం, కొన్ని పాత్రల రూపకల్పన, నాటకీయత విషయంలో దర్శకుడిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్ర విషయంలో సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ఈ అంశంపై బుచ్చిబాబు కూడా స్పందిస్తూ వివరణ ఇచ్చారు.అయితే బాక్సాఫీస్ పరంగా కూడా 'పెద్ది'పై విడుదలకు ముందు ఉన్న భారీ అంచనాలకు అనుగుణంగా ఫలితం రాలేదనే చర్చ జరిగింది.

ఈ నేపథ్యంలో బుచ్చిబాబు రెండో సినిమాతో ఎదుర్కొన్న అనుభవాన్ని సినీ వర్గాలు 'ద్వితీయ విఘ్నం'గా ప్రస్తావిస్తున్నాయి.ఇక ఇప్పుడు మరో సుకుమార్ శిష్యుడు శ్రీకాంత్ ఓదెల రెండో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'దసరా'తో దర్శకుడిగా పరిచయమైన శ్రీకాంత్ ఓదెల.. తొలి సినిమాతోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. నాని నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడంతో శ్రీకాంత్ ఓదెలపై అంచనాలు భారీగా పెరిగాయి.ఇప్పుడు నానితోనే మరోసారి 'ది ప్యారడైజ్' చిత్రాన్ని తెరకెక్కించారు. దీంతో ఈ సినిమా ఆయన కెరీర్‌లో అత్యంత కీలకంగా మారింది. 'దసరా'లో గ్రామీణ నేపథ్యంలో రా అండ్ రస్టిక్ ప్రపంచాన్ని ఆవిష్కరించిన శ్రీకాంత్ ఓదెల.. 'ది ప్యారడైజ్'లో మరింత భారీ స్థాయి కథను తీసుకున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో నాని పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి అభిమానుల్లో ఉంది. అయితే తొలి సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తర్వాత రెండో సినిమాతో దర్శకుడి పరిధి, ఆలోచనా విధానం మరింత విస్తరించడం సహజం. అదే సమయంలో అంచనాలు కూడా భారీగా పెరుగుతాయి. ఈ కారణంగానే తొలి విజయాన్ని రెండో సినిమాతో కొనసాగించగలరా? అనే చర్చ దర్శకుల కెరీర్‌లో ఆసక్తికర అంశంగా మారుతుంది.






## జూనియర్ ఎన్టీఆర్ 'డ్రాగన్'పై కీలక అప్‌డేట్.?

**జై భీమ్ న్యూస్, సినిమా :**

యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల షూటింగ్ సమయంలో భుజానికి గాయం కావడంతో ఎన్టీఆర్ వైద్యుల సూచన మేరకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసు కుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ తిరిగి షూటింగ్‌లో ఎప్పుడు పాల్గొంటారనే దానిపై తాజాగా కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకా రం.. ఎన్టీఆర్ అక్టోబర్ మొదటి వారం నుంచి 'డ్రాగన్' తదుపరి షెడ్యూల్‌లో పాల్గొనే అవకాశం ఉంది. గాయం కారణంగా ఎన్టీఆర్ కొంతకాలం షూటింగ్‌కు దూరమైనప్పటికీ.. దర్శకుడు ప్రశాంత్ నీల్ మాత్రం చిత్రీకరణను ఆపకుండా ముందుకు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.ఎన్టీఆర్ అవసరం లేని సన్నివేశాలతో పాటు ఇతర నటీనటులు పాల్గొనే కీలక సన్నివేశాలను ఈ విరామ సమయంలోనే చిత్రీకరించినట్లు సమాచా రం. దీంతో ఇప్పటివరకు సినిమా షూటింగ్ దాదాపు 70 శాతం పూర్తయినట్లు చిత్ర వర్గాల్లో ప్రచారం జరుగు తోంది. ఎన్టీఆర్ పూర్తిగా కోలుకుని సెట్స్‌లోకి అడుగు పెట్టిన తర్వాత మిగిలిన షూటింగ్‌ను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర బృందం ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో ప్రారంభమయ్యే ఈ సుదీర్ఘ షెడ్యూల్ వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉందని సమాచారం. 'డ్రాగన్' షూటింగ్‌తో పాటు ఈ సుదీర్ఘ షెడ్యూల్‌లోనే భవిష్యత్ సీక్వె ల్‌కు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను కూడా చిత్రీ కరించాలనే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.ప్రశాంత్ నీల్ సినిమాల్లో ఉండే భారీ యాక్షన్, డార్క్ షేడ్స్‌తో 'డ్రాగన్' కూడా తెరకెక్కుతున్నట్లు ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యాపారం, దాని వెనుక జరిగే ఆధిపత్య పోరాటం నేపథ్యంలో కథ సాగుతుందని సమాచారం. ఈ సినిమాలో ఎన్టీఆర్ ఇంతకు ముందెన్నడూ కనిపించని విభిన్నమైన మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ లో 'లూగర్' అనే క్రూరమైన పాత్రలో ఎన్టీఆర్‌ను పరిచయం చేయడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. 'డ్రాగన్'లో ఎన్టీఆర్ సరసన కన్నడ నటి రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్, మలయాళ సీనియర్ నటుడు బిజూ మీనన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2027 జూన్ 11న థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

## తెరపైకి రాని ఆ రెండు కలయికలు!

**జై భీమ్ న్యూస్, సినిమా :**



సినీ పరిశ్రమలో విజయాలు, పరాజయాలు సహజమే. అయితే ఒక దర్శకుడు తన సినిమాల కోసం ఆలోచించే విధానం, ఊహించే స్థాయి, కథను తెరపై ఆవిష్కరించాలనుకునే తీరు.. అతడి దృష్టి ఎంత విస్తృతంగా ఉందో చెబుతాయి. అలాంటి దర్శకుల్లో శంకర్ ఒకరు. భారీ కథలు, అద్భుతమైన దృశ్యాలు, సరికొత్త ఆలోచనలకు పెట్టింది పేరైన శంకర్ గురించి తాజాగా సంగీత దర్శకుడు తమన్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. శంకర్ దర్శకత్వంలో వచ్చిన రెండు సినిమాల కోసం ప్రపంచ సంగీత రంగంలోని దిగ్గజాలతో భారీగా పని చేయాలనే ప్రణాళికలు ఉన్నాయని తమన్ వెల్లడించారు.శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన 'ఎంథిరన్' సినిమా అప్పట్లో భారతీయ చిత్ర పరిశ్రమలోనే ఒక సంచలనంగా నిలిచింది. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. అయితే ఈ చిత్రానికి సంబంధించి ఇంతవరకు పెద్దగా బయటకు రాని ఒక ఆసక్తికరమైన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. 'ఎంథిరన్'లోని ఓ పాట కోసం ప్రపంచ ప్రఖ్యాత పాప్ గాయకుడు మైఖేల్ జాక్సన్‌తో కలిసి పనిచేయాలని ఏఆర్ రెహమాన్ భావించారట. తమన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. 'ఎంథిరన్' కోసం మైఖేల్ జాక్సన్‌తో ఒక ప్రత్యేక సహకారం గురించి చర్చలు జరిగాయి. 2009 మేలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళిక దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను కలిగిన మైఖేల్ జాక్సన్, భారతీయ సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమా కోసం పనిచేయడం జరిగి ఉంటే అది అంతర్జాతీయ స్థాయిలోనే ఒక ప్రత్యేక సంగీత కలయికగా నిలిచేది.కొత్త సినిమాలు చూడండి.అయితే ఆ కలయిక కార్యరూపం దాల్చలేదు. 2009 జూన్‌లో మైఖేల్ జాక్సన్ అనూహ్యంగా కన్నుమూయడంతో ఈ ప్రాజెక్ట్ అక్కడితో ఆగిపోయింది. తమన్ చెప్పిన మరో ఆసక్తికరమైన విషయం రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమాకు సంబంధించినది. శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించారు. సినిమాలోని 'ధోప్' పాటను అంతర్జాతీయ స్థాయిలో మరో విధంగా తీసుకెళ్లేందుకు చిత్ర బృందం ఒక భారీ ప్రణాళిక వేసిందట. 'ధోప్' పాటకు ఆంగ్ల వెర్షన్ రూపొందించి, దానిని అంతర్జాతీయంగా విడుదల చేయాలని భావించినట్లు తమన్ తెలిపారు. అంతేకాదు.. ఆ పాటకు బ్రిట్నీ స్పియర్స్‌ను ప్రత్యేక ఆకర్షణగా తీసుకురావాలనే ఆలోచన కూడా ఉందట. ప్రపంచ పాప్ సంగీతంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బ్రిట్నీ స్పియర్స్ ఈ పాటలో భాగమై ఉంటే 'గేమ్ ఛేంజర్'కు అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రచారం లభించే అవకాశం ఉండేది. అయితే సినిమా నిర్మాణంలో చోటుచేసుకున్న ఆలస్యాలు, ఇతర షెడ్యూల్ సమస్యల కారణంగా ఈ ప్రణాళిక ముందుకు సాగలేదని తమన్ వెల్లడించారు.

## జీవీ ప్రకాశ్, కయాదుల హారర్ థ్రిల్లర్ మెప్పించిందా?

**సినిమా రివ్యూ: ఇమ్మోర్టల్**

నటీనటులు: జీవీ ప్రకాశ్ కుమార్, కయాదు లోహర్, టీఎమ్ కార్తిక్, కుమార్ నటరాజన్, ఆదిత్య కథిర్ తదితరులు
సంగీతం: శ్యామ్ సీఎస్
రచన, దర్శకత్వం: మారియప్పన్ చిన్న

మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎప్పుడూ బిజీగా ఉండే జీవీ ప్రకాశ్ కుమార్, హీరోగానూ వరుస సినిమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన నటించిన సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్' నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ సినిమా ఏ మేరకు భయపెట్టింది? కథేంటి? రివ్యూలో తెలుసుకుందాం!

**కథ**

హైదరాబాద్‌లో తన మామయ్యకు చెందిన ప్రింటింగ్ ప్రెస్‌లో డిజైనర్‌గా జాబ్ చేస్తుంటాడు మహి (జీవీ ప్రకాశ్ కుమార్). అద్దె ఇంటి కోసం ప్రతిరోజూ నానా అవస్థలు పడుతుంటాడు. తక్కువ బడ్జెట్‌లో మంచి ఇల్లు దొరకక సతమతమవుతున్న తరుణంలో.. సింధు (కయాదు లోహర్) అనే యువతి షేరింగ్ ఫ్లాట్ గురించి ఫోన్ చేస్తుంది. ఆమె చెప్పిన అడ్రస్‌కి వెళ్లిన మహి, తొలి చూపులోనే సింధు అందానికి మనసు పారేసుకుంటాడు. మహి కోరిందల్లా క్షణాల్లో సమకూరుస్తూ సింధు కూడా అతనికి చాలా దగ్గరవుతుంది. అయితే అదే ఫ్లాట్‌లో ఉంటున్న సింధు తాతయ్య ఆకాశ్ (టీఎమ్ కార్తిక్) ద్వారా ఆమె గురించి ఒక దిగ్భ్రాంతికరమైన నిజం బయటపడుతుంది.

ఆ షాకింగ్ విషయం తెలిశాక మహి ప్రాణభయంతో వణికిపోతాడు. అసలు సింధు ఎవరు? ఆమె వెనుక ఉన్న రహస్యం ఏంటి? వెయ్యేళ్ల కిందటి మృగానికి సింధుకూ ఉన్న సంబంధం ఏంటి? చివరికి మహి ఆ ప్రమాదం నుంచి ఎలా బయటపడ్డాడు?

**విశ్లేషణ:**

హారర్ జోనర్‌కు ఫాంటసీ, థ్రిల్లర్ అంశాలను జోడించి కొత్త ప్రయత్నం చేయాలని దర్శకుడు మారియప్పన్ చిన్న చేసిన ప్రయత్నం అభినందనీయం. అయితే కథా నేపథ్యం కాస్త పాతదే అయినప్పటికీ, దాన్ని మలిచిన తీరులో కొన్ని థ్రిల్లింగ్ మూమెంట్స్ ఉన్నాయి. సినిమా ప్రారంభం హీరో అద్దె ఇళ్ల కోసం పడే తిప్పలతో సామాన్యంగా మొదలవుతుంది. సింధు ఎంట్రీతో కథ వేగవంతం అవుతుంది. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో దర్శకుడు ఇచ్చిన ట్విస్ట్ సినిమాపై ఆసక్తిని పెంచుతుంది.

ఇక ద్వితీయార్థంలో వచ్చే సన్నివే శాలు, ప్రీ-క్లైమాక్స్,చివరి 20 నిమిషాల యాక్షన్ సీక్వెన్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు లాజిక్ లకు కాస్త ఎక్కువగానే సినిమాటిక్ లిబర్టీ తీసుకు న్నప్పటికీ, ఎంటర్‌టైన్‌మెంట్ పరంగా సినిమా పర్వాలేద నిపిస్తుంది. సీక్వెల్ ఉంటుందని హింట్ ఇస్తూ ముగించిన విధానం ఆకట్టుకుంటుంది.

**నటీనటులు:**

మహి పాత్రలో జీవీ ప్రకాశ్ కుమార్ చాలా సహజంగా నటించారు. ముఖ్యంగా భయం, ఆశ్చర్యం, ప్రేమ వంటి విభిన్న భావోద్వేగాలను తన హావభావాలతో బాగా పండించారు. ఇక ఈ సినిమాకు అసలైన ప్రాణం కయాదు లోహర్. సింధు పాత్రలో ఆమె ఒదిగిపోయిన తీరు, కళ్ల ద్వారా పలికించిన ఎక్స్‌ప్రెషన్స్ సినిమాను నిలబెట్టాయి. మిగతా నటీనటులు తమ పరిధి మేరకు బాగానే నటించారు.

**సాంకేతికంగా**

ఈ సినిమాకు శ్యామ్ సీఎస్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా పెద్ద ప్లస్ పాయింట్. అనేక సాధారణ సన్నివేశాలను కూడా తన నేపథ్య సంగీతంతో థ్రిల్లింగ్‌గా మార్చారు. సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ వర్క్ కథకు తగినట్లుగా ఉన్నాయి. పరిమిత బడ్జెట్‌లో మేకర్స్ అనుకున్న అవుట్‌పుట్‌ను బాగానే తీసుకువచ్చారు.

**బలాలు:**

జీవీ ప్రకాష్, కయాదు నటన; బీజీఎం; సెకండ్ హాఫ్ ట్విస్టులు

**బలహీనతలు:**

రొటీన్ ప్లాట్; కొన్ని అనవసరమైన లాజిక్ లొసుగులు

చివరిగా పాత హారర్ ఫార్ములానే అయినప్పటికీ, కొత్త హంగులతో సాగే ఈ 'ఇమ్మోర్టల్' వీకెండ్‌లో టైమ్‌పాస్ కోసం చూసేయొచ్చు!





## 'ఆదర్శ కుటుంబం' నుంచి 'నారాయణమ్మ' ఫస్ట్ సింగిల్ అప్‌డేట్!

**జై భీమ్ న్యూస్, సినిమా :**

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి పాటైన 'నారాయణమ్మ' సాంగ్‌ను సెప్టెంబర్ 22న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ పాటపై ప్రేక్షకుల్లో మరియు అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.కొత్త సినిమాలు చూడండి.ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి, నివేతా థామస్, డింపుల్ హయతి తదితరులు నటిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలవుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ సినిమా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## 'ఇరుముడి' సినిమాలో పోలీసులు ఎందుకు కనిపించరు?






**జై భీమ్ న్యూస్, సినిమా :**

ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం రూ.200 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి తాజాగా ఓటీటీలో కూడా అడుగుపెట్టింది. అయితే ఈ చిత్రంలో పోలీసులు లేదా పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఎందుకు కనిపించరు అనే ప్రశ్నపై తాజాగా దర్శకుడు స్పష్టతనిచ్చారు. కథాంశంపై ప్రేక్షకుల దృష్టి పూర్తిగా కేంద్రీకృతమై ఉండాలనే ఉద్దేశంతోనే తాను ఉద్దేశపూర్వకంగానే పోలీస్ పాత్రలను లేదా విచారణను దూరంగా ఉంచినట్లు ఆయన తెలిపారు.సినిమాలోని ప్రధాన సన్నివేశాలు ఎలాంటి పక్కదారి పట్టకుండా, తాను అనుకున్న భావోద్వేగాలను ప్రేక్షకులు నేరుగా అనుభవించాలన్నదే తన ప్రధాన లక్ష్యమని శివ నిర్వాణ వివరించారు. ఒకవేళ తెరపైకి పోలీస్ ఇన్వెస్టిగేషన్ ప్రవేశపెడితే, ప్రేక్షకుల ఆలోచనలు కేవలం ఆ విచారణ దిశగానే మళ్లుతాయని, దానివల్ల అసలు కథలోని మూల భావన పక్కకు వెళ్లే అవకాశం ఉందని ఆయన భావించారు. అందుకే ప్రేక్షకులను ఎలాంటి పరధ్యానానికి గురిచేయకుండా, కథలోని డ్రామాను సహజంగా ఆస్వాదించేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
మంగళవారం 22- 09- 2026
www.jaibheemtv.com
8



## ప్లాంక్ చేస్తే
# బీపీ తగ్గుతుంది..?

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం :**
రోజుకు 60 సెకన్ల పాటు ప్లాంక్ చేయడం వల్ల రక్తపోటును నియంత్రించడంలో కొంత ప్రయోజనం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్లాంక్ వ్యాయామంలో కద లిక లేకుండా కండరాలను బిగించి ఉంచుతారు. దీనిని ఐసో మెట్రిక్ వ్యాయామం అంటారు. ప్లాంక్‌తోపాటు వాల్ సిట్, చేతితో గ్రిప్ పట్టుకోవడం వంటి వ్యాయామాలు కూడా ఈ విభాగంలోకి వస్తాయి. ఈ వ్యాయామాలు కండరాల్లో నిరంతర ఒత్తిడిని కలిగించడం ద్వారా కండరాల బలాన్ని పెంచడంతోపాటు రక్తనాళాలు ఒత్తిడికి స్పందించే విధానాన్ని ప్రభా వితం చేసే అవకాశం ఉంది. ప్లాంక్ చేసేటప్పుడు పొత్తిక డుపు, భుజాలు, వెన్ను, పిరుదులు వంటి అనేక కండరాలు ఒకేసారి పనిచేస్తాయి. ఒక నిమిషం పాటు ఈ స్థితిలో ఉం డడం వల్ల కండరాల్లో కొంతకాలం ఒత్తిడి పెరుగుతుంది. వ్యాయామం ముగిసిన తర్వాత రక్తప్రసరణ మెరుగుపడే ప్రక్రియ రక్తనాళాల పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. ఇలాంటి వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం వల్ల విశ్రాంతి సమయంలో ఉండే రక్తపోటు కొంత తగ్గే అవకాశం ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. 270 క్లినికల్ అధ్యయనాల సమగ్ర విశ్లేషణలో ఐసోమెట్రిక్ వ్యాయామాలు రక్తపోటును తగ్గించడంలో ఏరోబిక్, బలవర్ధక, అధిక తీవ్రత వ్యాయామాలతో పోలిస్తే గణనీయమైన ప్రభావాన్ని చూపి నట్లు తేలింది. అయితే ప్లాంక్ ఒక్కటే రక్తపోటుకు చికిత్స కాదు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల్య ఆహారం, ఏరోబిక్ వ్యాయామాలు, తగిన నిద్ర, ఇతర ఆరోగ్య కరమైన జీవనశైలి అలవాట్లతోపాటు దీనిని చేయాలి. ఏఐ ఐఎంఎస్‌కు చెందిన క్రీడా వైద్య నిపుణుడు డాక్టర్ రాజీవ్ కుమార్ తెలిపిన ప్రకారం 60 సెకన్ల పాటు ప్లాంక్ చేయడం గుండెకు మేలు చేసే జీవనశైలిలో భాగంగా ఉపయోగపడుతుంది. ఐసోమెట్రిక్ వ్యాయామాలు పెద్ద కండరాల సమూహాలను బలోపేతం చేయడం, రక్తప్రసరణను మెరుగు పరచడం ద్వారా రక్తపోటు తగ్గడంలో సహాయపడతాయని తెలిపారు. తక్కువ సమయం పాటు చేసే ఇలాంటి స్థిర వ్యాయామాలు సాధారణ వ్యాయామాలకు అదనంగా ఉపయోగ పడతాయని, విశ్రాంతి సమయంలో ఉండే రక్తపోటులో స్వల్ప తగ్గుదలకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

అయితే మొదటి రోజే 60 సెకన్ల పాటు ప్లాంక్ చేయాల్సిన అవసరం లేదు. ప్రారంభంలో 20 నుంచి 30 సెకన్ల పాటు చేసి, క్రమంగా సమయాన్ని 60 సెకన్లకు పెంచుకోవచ్చు. ప్లాంక్ చేసేటప్పుడు వెన్నెముకను నిటారుగా ఉంచి, పొత్తి కడుపు కండరాలను బిగించి, శ్వాసను సక్రమంగా తీసుకో వాలి. శ్వాసను బిగబట్టి ఉంచకూడదు. వారానికి 3 నుంచి 4 సార్లు ఐసోమెట్రిక్ వ్యాయామాలను చేయడం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. అయితే ప్లాంక్ వంటి ఐసోమెట్రిక్ వ్యా యామాలు చేస్తున్న సమయంలో రక్తపోటు తాత్కాలికంగా గణనీయంగా పెరుగుతుంది. ముఖ్యంగా ఎక్కువ తీవ్రతతో లేదా ఎక్కువ సమయం పాటు వ్యాయామం చేసినప్పుడు ఈ పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. అందువల్ల రక్తపోటు సమ స్య ఉన్నవారు చాలా తీవ్రంగా లేదా ఎక్కువసేపు ప్లాంక్ చే యకుండా జాగ్రత్తపడాలి. వ్యాయామం చేస్తున్నప్పుడు శ్వాస ను ఆపకుండా సక్రమంగా తీసుకోవడం చాలా ముఖ్యం. కొత్త వ్యాయామ కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు అధిక రక్తపోటు ఉన్నవారు వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది. అందువల్ల 60 సెకన్ల ప్లాంక్ రక్తపోటును దీర్ఘకాలంలో నియంత్రించడంలో సహాయపడే ఒక వ్యాయామంగా ఉప యోగపడుతుంది. అయితే దీనిని రక్తపోటు మందులకు ప్రత్యామ్నాయంగా భావించ కూడదు. క్రమం తప్పకుండా చేసే వ్యాయామం, ఆరో గ్యకరమైన ఆహారం, సరైన జీవనశైలి అలవాట్లతో కలిపి ప్లాంక్‌ను చేయడం గుండె ఆరోగ్యానికి మరింత ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

## పిల్లల్లో నిద్ర సమస్యలు
# ఎందుకో తెలుసా..?

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం :**
పిల్లల్లో నిద్ర సమస్యలు కేవలం ఎక్కువగా తెరలను చూడడం లేదా సమయానికి నిద్రించడానికి ఇష్టపడకపోవడం వల్లే వస్తాయని భావించకూడదు. శరీరంలోని జీవ గడియారం, నిద్ర అవసరం, వెలుతురు ప్రభావం, భావోద్వేగ ఉద్రిక్తత, రోజువారీ అలవాట్లలో స్థిరత్వం వంటి అనేక అంశాలు పిల్లల నిద్రను ప్రభావితం చేస్తాయి. వీటిలో పదేపదే మార్పులు చోటుచేసుకుంటే పిల్లలకు నిద్ర పట్టడం, నిద్రలో కొనసాగడం లేదా ఉదయం ఉత్సాహంగా మేల్కొనడం కష్టమవుతుంది. ముఖ్యంగా రాత్రి వేళ ప్రకాశవంతమైన వెలుతురు శరీరంలో నిద్రకు సంకేతమిచ్చే మెలటోనిన్ హార్మోన్ విడుదలను తగ్గిస్తుంది. ఆటలు ఆడడం, చిన్న వీడియోలు చూడడం వంటి ఉత్తేజపరిచే కార్యక్రమాలు నిద్రకు ముందు మెదడును మరింత చురుకుగా ఉంచుతాయి. అందువల్ల నిద్రకు ముందు చివరి గంటలో ఇలాంటి పరికరాలకు దూరంగా ఉంచడం మంచిది. వారాంతాల్లో ఆలస్యంగా నిద్రపోవడం, ఆలస్యంగా మేల్కొనడం కూడా పిల్లల నిద్ర చక్రాన్ని ప్రభావితం చేస్తుంది. వారంలో నిద్రించే సమయానికి, వారాంతపు నిద్ర సమయానికి మధ్య ఎక్కువ తేడా ఉంటే సోషల్ జెట్ లాగ్ వంటి పరిస్థితి ఏర్పడుతుంది. శనివారం, ఆదివారం ఎక్కువసేపు నిద్రించిన తర్వాత సోమవారం సాధారణ సమయానికి నిద్రపోవడం పిల్లలకు కష్టంగా మారుతుంది. అందుకే ప్రతిరోజూ దాదాపు ఒకే సమయానికి మేల్కొనేలా చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. ఉదయం సహజమైన సూర్య కాంతిలో కొంతసేపు గడపడం శరీర జీవ గడియారాన్ని క్రమబద్ధీకరించడంలో సహాయపడుతుంది. అలాగే భోజనం, ఆటలు, విశ్రాంతి, నిద్ర సమయాలను సాధ్యమైనంత వరకు ఒకే విధంగా కొనసాగించడం కూడా ముఖ్యం. నిద్రించే సమయంలో పిల్లలు నీళ్లు కావాలి, మరో కథ చెప్పాలి, తినడానికి ఏదైనా కావాలి అంటూ పదేపదే సమయం తీసుకోవడం సాధారణంగా కనిపిస్తుంది. అయితే ఇలా నిద్రను ఆలస్యం చేయడం అలవాటుగా మారితే సమస్య మరింత పెరుగుతుంది. స్నానం, దంతాలను తోముకోవడం, కథ చదవడం, దీపాలు ఆర్పడం వంటి పనులను ప్రతిరోజూ దాదాపు ఒకే క్రమంలో చేయడం ద్వారా నిద్ర సమయం వచ్చిందనే సంకేతం పిల్లల మెదడుకు అందుతుంది. కొంతమంది పిల్లలు తల్లిదండ్రులు పక్కన నిద్రించడం, టీవీ ఆన్‌లో ఉండడం లేదా ఊయల ఊపడం వంటి ప్రత్యేక పరిస్థితులు లేకుండా నిద్రపోలేరు. ఇలాంటి అలవాట్లను ఒక్కసారిగా మార్చడం కంటే క్రమంగా తగ్గించడం సులభంగా ఉంటుంది. పిల్లల రాత్రి నిద్రపై పగటి అలవాట్లు కూడా ప్రభావం చూపుతాయి. రోజులో తగినంత శారీరక శ్రమ లేకపోవడం, సహజమైన వెలుతురులో ఎక్కువ సమయం గడపకపోవడం వల్ల సాయంత్రానికి నిద్ర అవసరం తగినంతగా పెరగదు. అందువల్ల పిల్లలకు వయసుకు తగిన శారీరక కార్యకలాపాలు, బయట సహజమైన వెలుతురులో గడిపే సమయం ఉండేలా చూడాలి. మధ్యాహ్నం నిద్రపోయే సమయంపైనా శ్రద్ధ అవసరం. కోలా, ఎనర్జీ డ్రింక్స్, కొన్ని చాక్లెట్లలో ఉండే కెఫీన్ కూడా సున్నితంగా స్పందించే పిల్లల్లో నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. అయితే పిల్లల్లో గురక, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది, నోటి ద్వారా శ్వాస తీసుకోవడం, అశాంతిగా నిద్రపోవడం, ఉదయం తలనొప్పి లేదా పగటిపూట అధిక నిద్రమత్తు వంటి లక్షణాలు నిరంతరం కనిపిస్తే వాటిని సాధారణ నిద్ర అలవాట్ల సమస్యగా తీసుకోకూడదు. ఇలాంటి సందర్భాల్లో వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.



# ఐబీఎస్ సమస్య ఉన్నవారికి ఎంతో మేలు..?



**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం :**
ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్)తో బాధపడేవారిలో కడుపునొప్పి, ఉబ్బరం, అధిక గ్యాస్, మలబద్ధకం లేదా విరేచనాలు వంటి సమస్యలు తరచూ కనిపిస్తుం టాయి. ఈ సమస్యలను నియంత్రించేందుకు ఆహారంలో కొన్ని మార్పులు చేయడం, ఒత్తిడిని తగ్గించడం, వైద్యుల సూచనలు పాటించడం కీలకం. ఈ నేపథ్యంలో మన దేశంలో చాలాకాలంగా ఉపయోగిస్తున్న సత్తు కూడా జీర్ణవ్యవస్థకు ఉపయోగకరమైన ఆహారంగా నిపుణులు సూచిస్తున్నారు. శనగలను పొడిగా వేయించి తయారు చేసే సత్తులో పీచు, మొక్కల ఆధారిత ప్రొటీన్లు, ఇతర పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా మలబద్ధకంతో కూడిన ఐబీఎస్ ఉన్నవారికి తగిన మోతాదులో సత్తు తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. సత్తులో ఉండే కరిగే పీచు, రెసిస్టెంట్ స్టార్చ్ పేగుల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇవి పేగుల్లో నీటిని గ్రహించి మలాన్ని సులభంగా బయటకు వెళ్లేలా చేయడంలో తోడ్పడతాయి. రెసిస్టెంట్ స్టార్చ్ పెద్దపేగుకు చేరిన తర్వాత అక్కడి మంచి బ్యాక్టీరియా ద్వారా విచ్ఛిన్నమై ఉపయోగకరమైన షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్లుగా మారుతుంది. ఇవి పెద్దపేగు ఆరోగ్యానికి, పేగుల లోపలి పొరను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అయితే ఐబీఎస్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకే రకమైన ఆహారం సరిపోదు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు సత్తును తక్కువ మోతాదుతో ప్రారంభించడం మంచిది. ఉబ్బరం, కడుపులో గ్యాస్ వంటి సమస్యలను తగ్గించడంలోనూ సత్తు కొంతవరకు సహాయపడుతుంది. పొడిగా వేయించే ప్రక్రియలో పప్పులోని కొన్ని గ్యాస్ కలిగించే పదార్థాలు తగ్గుతాయి. దీంతో సాధారణంగా పప్పుధాన్యాలు తిన్నప్పుడు ఎదురయ్యే అసౌకర్యం కొంత తగ్గే అవకాశం ఉంటుంది. నీటిలో పలుచగా కలిపి తీసుకున్నప్పుడు సత్తు సులభంగా జీర్ణమయ్యే రూపంలో ఉంటుంది. దీనిలో వేయించిన జీలకర్ర పొడి, కొద్దిగా రాక్ సాల్ట్, నిమ్మరసం కలుపుకోవచ్చు. ఇవి జీర్ణక్రియకు తోడ్పడటంతోపాటు భోజనం తర్వాత వచ్చే కడుపు ఉబ్బరాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. సత్తును తీసుకునే విధానంపైనా శ్రద్ధ తీసుకోవడం అవసరం. ఒక పెద్ద గ్లాసు గది ఉష్ణోగ్రతలో ఉన్న లేదా గోరువెచ్చని నీటిలో ఒకటి నుంచి రెండు టేబుల్‌స్పూన్ల సత్తును కలిపి పలుచగా తయారు చేసుకుని తాగవచ్చు. ఉదయం మధ్య సమయంలో లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. రాత్రివేళ తీసుకోవడం మాత్రం నివారించడం మంచిది. విరేచనాలతో కూడిన ఐబీఎస్ లేదా తీవ్రమైన సమస్యలు ఉన్నవారు సత్తును ఒక్కసారిగా ఎక్కువగా తీసుకోకుండా ఒక టీస్పూన్ వంటి తక్కువ మోతాదుతో ప్రారంభించి శరీరం ఎలా స్పందిస్తుందో గమనించాలి. పీచును ఒక్కసారిగా ఎక్కువగా తీసుకుంటే కొందరిలో పేగుల కదలికలు పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఐబీఎస్ ఉన్నవారు తమ లక్షణాలను బట్టి, అవసరమైతే వైద్యుల సలహాతోనే ఆహారంలో సత్తును చేర్చుకోవడం సురక్షితమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

# ఈ కాంబినేషన్లతో జాగ్రత్త..?

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం :**
వయసు పెరిగేకొద్దీ రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఒకేసారి అనేక మందులు వాడాల్సి వస్తుంటుంది. అయితే ఇలా పలు మందులను కలిపి తీసుకునే సమయంలో కొన్ని ఔషధాల మధ్య పరస్పర ప్రభావాలు ఏర్పడి తీవ్రమైన దుష్ప్రభావాలు తలెత్తే అవకాశం ఉంటుంది. వయసు పెరిగే కొద్దీ కాలేయం, మూత్రపిండాల పనితీరు మందగించడం వల్ల శరీరంలోకి చేరిన మందులు బయటకు వెళ్లేందుకు ఎక్కువ సమయం పడుతుంది. దీంతో ఒకప్పుడు సురక్షితం గా ఉన్న మోతాదు కూడా వృద్ధాప్యంలో దుష్ప్రభావాలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతిరోజూ తీసుకునే అన్ని మందులు, సప్లిమెంట్లు, వైద్యుల సూచన లేకుండా వాడే మందుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం అవసరం. రక్తాన్ని పలుచబరిచే మందులతో పాటు ఇబుప్రోఫెన్, న్యాప్రోక్సెన్ వంటి నొప్పి నివారణ మందులు తీసుకోవడం వల్ల జీర్ణాశయంలో రక్తస్రావం, కడుపులో పుండ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అలాగే రక్తపోటు కోసం ఉపయోగించే ఏసీఈ ఇన్హిబిటర్లతోపాటు పొటాషియం సప్లిమెంట్లు లేదా పొటాషియంను నిల్వ చేసే కొన్ని మూత్రవిసర్జక మందులు తీసుకుంటే రక్తంలో పొటాషియం స్థాయిలు ప్రమాదకరంగా పెరిగే అవకాశం ఉంటుంది. ఇది గుండె స్పందనలో అసాధారణ మార్పులకు దారితీస్తుంది. కాబట్టి పొటాషియం సప్లిమెంట్లు లేదా ప్రత్యేక ఉప్పు వంటి వాటిని వైద్యుల సలహా లేకుండా ప్రారంభించకూడదు. ఆందోళన, నిద్ర కోసం ఉపయోగించే కొన్ని మందులను ఆక్సికోడోన్, ట్రామడాల్ వంటి బలమైన నొప్పి నివారణ మందులతో కలిపి తీసుకోవడం కూడా ప్రమాదకరం. ఈ మందుల ప్రభావం కలిసి మెదడు, నాడీ వ్యవస్థ పనితీరు మరింత మందగించడంతో తీవ్రమైన మగత, గందరగోళం, పడిపోవడం, శ్వాస మందగించడం వంటి సమస్యలు వస్తాయి. మరోవైపు కాల్షియం సప్లిమెంట్లు లేదా కొన్ని అంటాసిడ్లను థైరాయిడ్ మందులతో కలిపి తీసుకుంటే థైరాయిడ్ మందు శరీరంలోకి సరిగా శోషణ అవ్వదు. అందువల్ల ఈ మందుల మధ్య కనీసం నాలుగు గంటల విరామం ఉండేలా చూసుకోవాలి. థైరాయిడ్ మందును సాధారణంగా ఉదయం ఖాళీ కడుపుతో నీటితో తీసుకోవాలని సూచిస్తారు.

కొలెస్ట్రాల్ తగ్గించే కొన్ని మందులను ఎరిత్రోమైసిన్ వంటి కొన్ని యాంటీబయాటిక్స్ లేదా కెటో కోనజోల్ వంటి యాంటీ ఫంగల్ మందులతో కలిపి తీసు కున్నప్పుడు మందుల స్థాయిలు శరీరంలో అధికంగా పేరు కుపోయే అవకాశం ఉంటుంది. దీంతో తీవ్రమైన కండరాల నష్టం, మూత్రపిండాలపై ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతా యి. ముఖ్యంగా వృద్ధుల్లో మందుల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఒక వైద్యుడు సూచించిన మందుతో పాటు ఇతర వైద్యుల మందులు, ఓవర్‌ది కౌంటర్ మందులు, సప్లిమెంట్లు తీసుకుంటున్నట్లయితే వాటి వివరాలను తప్పనిసరిగా తెలియజేయాలి. ఏదైనా అసాధారణ దుష్ప్రభావం కనిపిస్తే స్వయంగా మందు ఆపకుండా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సను సమీక్షించుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.



## రొమ్ము క్యాన్సర్ చికిత్సకు
# కొత్త ఔషధం..

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం :**
అధునాతన రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కొత్త ఆశలు రేకెత్తించిన క్యాన్సర్ ఔషధానికి కీలకమైన క్లినికల్ ట్రయల్‌లో ఆశించిన ఫలితాలు దక్కలేదు. ఆస్ట్రాజెనెకా అభివృద్ధి చేసిన క్యామిజెస్ట్రాంట్‌ను అధునాతన హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్, హెచ్‌ఈఆర్2 నెగెటివ్ రొమ్ము క్యాన్సర్ చికిత్సలో పరిశీలించారు. సెరెనా-4 పేరుతో నిర్వహించిన మూడో దశ క్లినికల్ ట్రయల్‌లో 1,371 మంది ఇంతకుముందు చికిత్స పొందని రోగులు పాల్గొన్నారు. క్యామిజెస్ట్రాంట్‌ను ఇబ్రాన్స్ అనే ఔషధంతో కలిపి ఇచ్చిన చికిత్సను, ఇబ్రాన్స్‌తో పాటు సాధారణ హార్మోన్ తగ్గించే చికిత్సతో పోల్చారు. క్యాన్సర్ ముదిరే వరకు రోగులు వ్యాధి నియంత్రణలో ఉన్న కాలాన్ని ప్రధానంగా పరిశీలించారు. క్యాన్సర్ పరీక్షలు చేయించుకోండి

క్యామిజెస్ట్రాంట్ కలయికతో చికిత్స పొందిన రోగుల్లో క్యాన్సర్ ముదిరే వరకు ఉన్న కాలంలో సంఖ్యాపరంగా కొంత మెరుగుదల కనిపించింది. అయితే ఈ తేడా గణాంకపరంగా ముఖ్యమైన స్థాయికి చేరుకోలేదు. అంటే ఈ చికిత్స వల్ల ప్రామాణిక చికిత్సతో పోలిస్తే స్పష్టమైన అదనపు ప్రయోజనం ఉందని ఈ అధ్యయనం నిర్ధారించలేకపోయింది. ట్రయల్‌కు సంబంధించిన పూర్తి వివరాలను భవిష్యత్తులో జరిగే వైద్య సమావేశంలో వెల్లడించనున్నట్లు ఔషధ సంస్థ తెలిపింది. ఈ ఫలితం నిర్దిష్ట చికిత్సా పరిస్థితిలో క్యామిజెస్ట్రాంట్ ప్రభావంపై మరింత పరిశోధన అవసరాన్ని సూచిస్తోంది. క్యామిజెస్ట్రాంట్ అనేది ఈస్ట్రోజెన్ రిసెప్టర్ కార్యకలాపాలను లక్ష్యంగా చేసుకునే ఔషధం. ఇది సెలెక్టివ్ ఈస్ట్రోజెన్ రిసెప్టర్ డీగ్రేడర్ అనే ఔషధాల తరగతికి చెందుతుంది. హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్ రొమ్ము క్యాన్సర్‌లో ఈస్ట్రోజెన్ వంటి హార్మోన్లు క్యాన్సర్ కణాల పెరుగుదలకు సహకరిస్తాయి. ఈస్ట్రోజెన్ రిసెప్టర్‌ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా క్యాన్సర్ పెరుగుదలను నెమ్మదించడం లేదా అడ్డుకోవడం ఈ ఔషధం ఉద్దేశం. ముఖ్యంగా ఈఎస్ఆర్1 జన్యు మార్పులు ఏర్పడిన కొన్ని రొమ్ము క్యాన్సర్లలో హార్మోన్ ఆధారిత చికిత్సలకు నిరోధకత పెరుగుతుందని భావిస్తున్న నేపథ్యంలో ఈ ఔషధాన్ని పరిశీలిస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు బుక్ చేయండి.

అయితే ఈ ట్రయల్‌లో ఆశించిన ఫలితం రాకపోయినప్పటికీ క్యామిజెస్ట్రాంట్‌పై పరిశోధనలు పూర్తిగా నిలిచిపోలేదు. ఇతర రకాల రొమ్ము క్యాన్సర్ చికిత్సా పరిస్థితుల్లో, ముఖ్యంగా వ్యాధి ప్రారంభ దశల్లోనూ ఈ ఔషధాన్ని పరిశీలిస్తున్నారు. ఇటీవల ఇదే తరహాలో మరో ఔషధ కలయిక కూడా అధునాతన దశలో క్యాన్సర్ ముదిరే సమయాన్ని గణనీయంగా ఆలస్యం చేయడంలో విఫలమైంది. హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్, హెచ్‌ఈఆర్2 నెగెటివ్ రొమ్ము క్యాన్సర్‌కు లక్షిత చికిత్సల్లో పురోగతి సాధిస్తున్నప్పటికీ, ప్రతి చికిత్సా విధానం అన్ని రోగులలో ఒకే విధమైన ప్రయోజనాన్ని అందించదని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.